Crime Mirror
QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
13-2-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 91

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## అసమానతల నిర్మూలనకే ఎస్సీ వర్గీకరణ

ఇది ఎవరికో లాభం చేకూర్చే విషయం కాదు

ప్రతి గడపకు ఎస్సీవర్గీకరణ లక్ష్యం తీసుకెళ్లాలి

ఎస్సీ ఎమ్మెల్సీలకు మంత్రి దామోదర సూచన

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అణిచివేతకు గురైన కులాల్లోని అసమానతలను రూపుమాపేందుకే ఎస్సీ వర్గీకరణ అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. వర్గీకరణ అనేది ఏ కులానికో, వర్గానికో వ్యతిరేకం కాదన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి గడపకూ వర్గీకరణ ఫలాలను తీసుకెళ్లే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, లక్ష్మీకాంతరావు, అడ్లూరి లక్ష్మణ్,

- మిగతా 2వ పేజీలో



## శాస్త్రీయంగానే తెలంగాణ కులగణన

సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం

16నుంచి 28 వరకు ఎన్యూమరేటర్లకు సమాచారాం ఇవ్వాలి

42శాతం బిసి రిజర్వేషన్ కోసం కేబినేట్ తీర్మానం

చట్టబద్ధత కోసం కులగణన బిల్లు కేంద్రానికి పంపుతాం

మీడియాకు వివరించిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. వివిధ కారణాల వల్ల కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 16 నుంచి 28 వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలని సూచించారు. రాష్ట్ర జనాభా లెక్కల్లోకి వచ్చే విధంగా అందరూ చూసుకోవాలని కోరారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

- మిగతా 2వ పేజీలో



### కోళ్ల బర్డ్‌ఫ్లూపై అధికారుల అలర్ట్

చికెన్ తక్కువగా తినాలని సూచనలు

ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాల తనిఖీలు



### రాజ్యసభకు కమల్ హాసన్?

చెన్నై: సీనియర్ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే చర్చ తమిళనాట జోరుగా నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమికి మద్దతు ప్రకటించిన ఆయన.. డీఎంకే అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు.

## స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం

న్యాయపరమైన చిక్కులు రాకుండా చర్యలు

రిజర్వేషన్లపై ప్రభుత్వం మల్లగుల్లాలు



అసెంబ్లీలో, పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదానికి సమయం పట్టే చాన్స్

మే లేదా జూన్‌లో ఒకేసారి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించవచ్చనే అంచనా

సీఎం రేవంత్ ఆధ్వర్యంలో 'స్థానిక' ఎన్నికలపై చర్చ

తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ రిజర్వేషన్లు పెంచేలా కేంద్రాన్ని కోరాలని నిర్ణయం!

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కానరావడం లేదు. ఓ వైపు సమీక్షలు చేస్తుంటే..మరోవైపు మళ్లీ కులగణకు అవకాశం ఇవ్వండతో అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ఆసల్యం తప్పదన్న భావన కూడా ఉంది. ఈనెల 15వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని భావించారు.

## కలిసి నడుద్దాం.. కలిమి సాధిద్దాం

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ నిర్ణయం

పారిస్ నుంచి మాసే సిటీకి వెళ్తూ విమానంలో ద్వైపాక్షిక చర్చలు





### మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే..

## అందరి లెక్కలు తేలుస్తా

చంద్రబాబు మోసాలు ప్రజల్లో ఎండగట్టాల్సిందే

సూపర్ సిక్స్ హామీలపై చేతులెత్తేసిన చంద్రబాబు

రోజురోజుకూ ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత

గుంటూరు నేతల సమావేశంలో జగన్ కీలక వ్యాఖ్యలు

### ఉచితాలపై సుప్రీం కోర్టు

## సీరియస్ వ్యాఖ్యలు

కష్టపడకుండానే డబ్బులు వస్తే..పనిచేస్తారా

రాజకీయ పార్టీల ఉచిత హామీలపై సుప్రీం వ్యాఖ్యలు

దీంతో పని చేయడానికి ఇష్టపడట్లేదు

మహారాష్ట్రలో ఎన్నికలముందు పథకాలతో

రైతులకు కూలీలు దొరకడంలేదు

నిరాశ్రయులను ప్రధాన స్రవంతిలోకి తేవాలి

దేశాభివృద్ధికి వారూ తోడ్పడేలా చేయాలి

సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఉచితాలపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో ఉచితాలను ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది.

2లో



## అసమానతల నిర్మూలనకే ఎస్సీ వర్గీకరణ

మందుల సామెల్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తదితరులు ఇవాళ హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రి వారికి దిశానిర్దేశర చేశారు. ఇతరులు సృష్టించే అపోహలను, అనుమానాలను నమ్మి ప్రజలు ఆందోళనకు గురికాకుండా చూసే బాధ్యత ఎమ్మెల్యేలది, మాదిగ సామాజిక వర్గ నాయకులదేనన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ మద్దతుగా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు. 2006 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో, 2024 ఆగస్ట్ ఒకటిన తీర్పు వచ్చిందని, తీర్పు వచ్చిన గంట లోపలే వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్ ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఆ వెంటనే కేబినెట్ సబ్ కమిటీ, ఆ తర్వాత వన్ మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించారన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా, జనాభా, విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక స్థితిగతులను కమిషన్ అధ్యయనం చేసిందని తెలిపారు. అన్నిరకాల విశ్లేషణ, అధ్యయనం తర్వాత శాస్త్రీయంగా రూపొందించిన రిపోర్ట్‌ను అందించిందన్నారు. ఇది కాంగ్రెస్ కమిట్‌మెంట్ అని, సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ప్రజలకు చెప్పాలన్నారు. ప్రతి కులానికి న్యాయం చేసేలా వర్గీకరణ ఉందని మంత్రి తెలిపారు. అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ వన్‌లో, 18 కులాలను గ్రూప్2లో, కొంత మెరుగ్గా ఉన్న కులాలను గ్రూప్3లో చేర్చాలని కమిషన్ సూచించిందన్నారు. మాదిగ, మాదిగ సామాజిక వర్గాల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరుతున్న ఈ తరుణాన్ని పండుగలా జరుపుకోవాలని సూచించారు.

## రాజ్యసభకు కమల్ హాసన్?

ఆ ఎన్నికల్లో మొత్తం 39 సీట్లను కూటమి కైవసరం చేసుకుంది. దీంతో ఆయన్ను పెద్దల సభకు నామినేట్ చేయాలని డీఎంకే భావిస్తోందన్నది ఆ ప్రచార సారాంశం. ఈ ఏడాది జూన్‌లో రాజ్యసభ నుంచి ఆరు సీట్లు ఖాళీ కానున్నాయి. అయితే ఎన్నికల్లో మద్దతు ప్రకటించిన కమల్‌ను రాజ్యసభకు పంపే యోచనలో డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ ఉన్నారట. తాజాగా.. బుధవారం తమిళనాడు మంత్రి పీకే శేఖర్‌బాబు కమల్ హాసన్ నివాసానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. మరోవైపు కమల్ పార్టీ మక్కల్ నీది మయ్యమ్ ప్రతినిధి మురళి అప్పాస్.. తమ పార్టీకి ఓ రాజ్యసభ సీటు దక్కబోతుందనే విషయాన్ని ధృవీకరించారు. అయితే అది ఎవరనేది పార్టీ అధ్యక్షుడు కమల్ హాసనే నిర్ణయిస్తారని తెలిపారాయన. శేఖర్‌బాబుతో కమల్ జరిపిన చర్చల సారాంశాన్ని ఆయన మీడియాకు వివరించేందుకు నిరాకరించారు. 2018, ఫిబ్రవరి 21వ తేదీన కమల్ హాసన్ ఎన్ఎంఎం పార్టీని మధురైలో స్థాపించారు. అప్పటి నుంచి ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రభావం చూపెట్టలేకపోయింది. 2019 సార్వత్రిక ఆయన పార్టీ పోటీ చేసినప్పటికీ. ఆశించిన ఫలితం సాధించలేకపోయింది. అయితే.. ఓటు షేర్ మాత్రం 3.72 శాతం దక్కించుకుంది. మరీ ముఖ్యంగా చెన్నై, కోయంబత్తూరు, మధురైలో భారీగా ఓట్లు పడ్డాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేసినా.. ఒక్క సీటు గెలవలేకపోయింది. కోయంబత్తూరులో పోటీ చేసిన కమల్.. బీజేపీ అభ్యర్థి వనతిశ్రీనివాసన్ చేతిలో 1,728 ఓట్ల మెజారిటీలోఓటమి పాలయ్యారు. 2022 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసినా.. 140 స్థానాలకు ఒక్కటి కూడా గెలవలేకపోయింది.

## కలిసి నడుద్దాం.. కలిమి సాధిద్దాం



పారిస్: వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులతోపాటు కీలక రంగాల్లో భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధ బాంధవ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ నిర్ణయించుకున్నారు. ఇండో%-%పసిఫిక్ ప్రాంతంతోపాటు అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాల నడుమ పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయానికొచ్చారు. ఇరుదేశాలు కలిసికట్టుగా ముందుకు సాగుతూ బలీయమైన శక్తులుగా ఎదగాలన్నదే తమ ఆశయమని పేర్కొన్నారు. ప్రజా బాహుళ్యానికి సామాజికంగా, ఆర్థికంగా లబ్ధి చేకూర్చడానికి, పర్యావరణ పరిరక్షణకు కృత్రిమ మేధ(ఏఐ)ను సవ్యదిశలో ఉపయోగించుకొనేలా చర్యలు తీసుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని ఇద్దరు నేతలు ఉద్ఘాటించారు. నరేంద్ర మోదీ, ఇమ్మానుయేల్ మాక్రాన్ బుధవారం సమావేశమయ్యారు. ఇరువురు నేతలు ఫ్రాన్స్ రాజధాని పారిస్ నుంచి మాసే నగరానికి విమానంలో వెళ్తూ చర్చల్లో పాల్గొన్నారు. భారత్, ఫ్రాన్స్ మధ్య సుదృఢమైన సంబంధాలే లక్ష్యంగా విస్తృత స్థాయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ద్వైపాక్షిక అంశాలతోపాటు కీలక ప్రాంతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు సైతం ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. ఈ ఏడాది ద్వైపాక్షిక సహకారం విషయంలో డిజిటల్ హెల్త్, యాంటీ%-%మైక్రోబియల్ రెసిస్టెన్స్, రెండు దేశాల మధ్య ఆరోగ్య నిపుణుల మార్పిడిని ప్రాధాన్య అంశాలుగా గుర్తించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణమే సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని మోదీ, మాక్రాన్ తేల్చి చెప్పారు. ఈ అంశంతోపాటు అంతర్జాతీయ వ్యవహారాలపై పరస్పరం సమన్వయంతో పని చేయాలని అంగీకారానికి వచ్చారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్‌కు గట్టిగా మద్దతు ఇస్తున్నామని మాక్రాన్ ఈ సందర్భంగా స్పష్టంచేశారు. భారత్, ఫ్రాన్స్ మధ్య బంధం గత 25 ఏళ్లుగా నానాటికీ బలపడుతోందని, బహుముఖ భాగస్వామ్యంగా రూపాంతరం చెందుతోందని ఇరువురు నేతలు హర్షం వ్యక్తంచేశారు.

# స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం

(మొదటి పేజీ తరువాయి)



కానీ, స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోసారి కులగణన సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు అవకాశం కల్పించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని స్పష్టం చేసింది. దీంతో రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందాకే ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం అంటే3.50 కోట్ల మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం అంటే 16లక్షల మంది వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు. అయితే ఈ లెక్కల ఆధారంగానే పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను వెంట వెంటనే నిర్వహించనుందని సమాచారం. ఎన్నికలకు సన్నద్ధతపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల కమిషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాను సైతం ఈసీ ఇటీవలే ప్రకటించింది. ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్ పెట్టే అవకాశం ఉంది. తాజాగా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పంచాయతీ ఎన్నికలపై సీఎస్ శాంతి కుమారి, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చిన వెంటనే షెడ్యూల్ రిలీజయ్యే అవకాశం ఉంది. 42శాతం సీట్లు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో పాత పద్ధతినే అమలు చేస్తారని తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు యాభైశాతం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలను సమావేశపర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అది సాధ్యం కాదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఒక అడుగు ముందుకు వేసింది. తమ పార్టీ 42శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఇటీవలే రైతు భరోసా మొత్తాన్ని కర్షకుల ఖాతాల్లో జమ చేసింది. బీసీ కులగణన చేపట్టి 56 శాతం వెనుకబడిన వర్గాల వారున్నారని తేల్చింది. వారికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులున్న దృష్ట్యా పార్టీగా ప్రకటిస్తామని వివరించింది. ముందుగా పార్టీ గుర్తుతో సంబంధం లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏక గ్రీవాలు అధికంగా చేయడం ద్వారా మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకోవాలని భావించింది. ఈసీ నోటా అంశాన్ని తెరమీదకు తేవడంతో కొంత ఇబ్బంది పడ్డ కాంగ్రెస్.. ఇవాళ నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఒకే అభ్యర్థి బరిలో ఉంటే నోటాతో పోటీ పెట్టే అంశాన్ని వ్యతిరేకించింది. గెలిచిన సర్పంచులు.. అభివృద్ధి కోసం తమ పార్టీలో చేరుతారని భావిస్తోంది. వారిని చేర్చుకొని వాళ్ల అండతో ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమయ్యే అవకాశ ఉంది. ఇలా చేయడం ద్వారా మెజార్టీ మండలాల్లో పాగా వేయొచ్చన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బీసీలకు కొంచం తక్కువ 23 శాతం సీట్లను కేటాయించనుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు 28శాతం స్థానాలను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై న్యాయ సమీక్ష జరిగిన తర్వాత ఎలాంటి ఆటంకాలు రావని నిర్ధారించుకున్న మీదటే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

# శాస్త్రీయంగానే తెలంగాణ కులగణన

(మొదటి పేజీ తరువాయి)

'బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మార్చి మొదటి వారంలో కేబినెట్ తీర్మానం చేయనుంది. శాసనసభలో బిల్లు ఆమోదం చేసి చట్టబద్ధం చేయాలని నిర్ణయించాం. కులగణన బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదానికి కృషి చేస్తాం. ఓబీసీల రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నాయకులను కలుస్తాం. దశాబ్దాల ఓబీసీల కలలను నిజం చేసేందుకు కృషి చేస్తాం. రిజర్వేషన్లపై రాజకీయపరంగా కుట్రలు చేస్తే తిప్పి కొడతాం. రాజకీయ లబ్ది పక్కన పెట్టి మద్దతు పలకాలని కోరుతున్నాం' అని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే సహేతుకంగా, స్పష్టంగా చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే పై అసెంబ్లీలో లెక్కలతో సహా సీఎం సభ దృష్టికి తెచ్చారని, అసెంబ్లీలో చర్చ సందర్భంగా అనేక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సలహాలు సూచనలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే సహేతుకంగా, స్పష్టంగా చేశామని ఆయన పేర్కొన్నారు. 3.1శాతం మంది మాత్రమే ఇంటి యజమానులు సర్వేలో పాల్గొనలేదన్నారు. కొద్దిమంది ఇంటికి తాళాలు వేసి వెళ్లారని ఆయన తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి వాళ్ళు ఉద్దేశపూర్వకంగా సర్వేకు రాలేదని, సర్వేలో పాల్గొని వారి కోసం మరోసారి కుటుంబ సర్వేకు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మరో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. టోల్ ఫ్రీ ద్వారా కూడా సమాచారాన్ని ఇస్తే ఎన్యుమరేటర్లు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని భట్టి విక్రమార్క తెలిపారు. మండల కేంద్రాల్లో రాష్ట్ర జనాభా లెక్కల్లోకి రావాలని అందర్ని కోరుతున్నామన్నారు. అంతేకాకుండా.. 'లెక్కలోకి వచ్చి జన జీవన స్రవంతిలో కలవాలని కేసీఆర్ లాంటి వాళ్ళను కోరుతున్నాను. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు వివరాల నమోదు పూర్తి చేసి? లెక్కలన్నీ క్యాబినెట్ లో పెట్టి బీసీలకీ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. మార్చి మొదటి వారంలో క్యాబినెట్ లో పెట్టి తర్వాత అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేస్తాం. .ఈ బిల్లును కేంద్రానికి పంపి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం. పార్లమెంటు లో కూడా ఈ బిల్ పెట్టి ఆమోదించేలా రాహుల్ గాంధీని, ప్రధానిని, అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి వారి మద్దతు కూడా గడతాం. దశాబ్దాల బిసిల కల నెరవేర్చుతాం. కలసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను తీసుకుని ఢిల్లీ వెళతాం. స్థానిక సంస్థల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేస్తాం. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం మేం చేసే కార్యక్రమానికి మద్దతు పలకాలని కోరుతున్నాం. ప్రగతిశీల భావజాలలు ఉన్న అందరు కలిసి రావాలి.' అని భట్టి విక్రమార్క అన్నారు.

# మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే..అందరి లెక్కలు తేలుస్తా

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఎపి ప్రభుత్వం మీద వ్యతిరేకత రోజురోజుకీ పెరుగుతోందని వైఎస్ఆర్ సిపి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని, అందరి లెక్కలు తేలుస్తామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలతో జరిగిన భేటీలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామిల్లో ఏవీ నెరవేర్చడం లేదని దుయ్యబట్టారు. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత రోజు రోజుకీ తీవ్రమవుతోందని జగన్ తెలియజేశారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై చంద్రబాబు చేతులెత్తేశారని విమర్శలు గుప్పించారు. అందుకే ఏవేవో సాకులు చెబుతూ..అవి ప్రజలు నమ్మేలా ప్రచారం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. చంద్రబాబు వంచన, దారుణ మోసాలను.. మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అందుకోసం రోజూ ప్రజల్లో ఉండాలని, ప్రజలతో మరింత మమేకం కావాలని జగన్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను గాలికి వదిలేసిన చంద్రబాబు ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దారుణమైన పరిస్థితులు తప్పవని అన్నారు. '201924 మధ్య జగన్ 1.0 ప్రభుత్వం నడిచింది. ఆ టైంలో చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా పాలన నడిచింది. లంచాలకు తావు లేకుండా రూ. 2.71 లక్షల కోట్లు డీబీటీ చేశాం. కోవిడ్ వల్ల ఆదాయం తగ్గినా హామీలు అమలు చేశాం. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం. కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశాం. మనం చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉంది. ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టారు. బాబు మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలు తిరోగమనంలో ఉన్నాయి. మన హయాంలోని పథకాలన్నీ రద్దు చేశారు. మొన్నటి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయి. కూటమి కంటే మనకు 10 శాతం ఓట్లు మాత్రమే తగ్గాయి. కారణం.. వారిలా నేను అబద్దాలు చెప్పలేకోవడం, కానీ, జగన్.. కార్యర్తలు, ప్రజలందరి మనసులో ఉన్నాడు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీత ఉండాలి. మీ జగన్ మరో 25-30 సంవత్సరాలు రాజకీయాల్లో ఉంటాడు. మనం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాం. ప్రజల కోసం ఇన్ని బటన్లు నొక్కిన మనకే ఈ పరిస్థితి ఉంటే.. రేపు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన ఈ సర్కార్ పరిస్థితి ఏంటని అన్నారు. రాష్ట్రంలో స్కాంలు తప్ప ఏం జరగడం లేదు. దోచుకోవడం, పంచుకోవడమే జరుగుతోంది. ప్రశ్నిస్తున్నవారిపై 111 సెక్షన్ కేసులు పెడుతున్నారు. తీవ్రవాదులపై పెట్టే కేసులతో వేధించి జైళ్లలో పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ కేడర్ అరెస్టులకు భయపడొద్దు. మంచి పాలన చేస్తే ప్రజలు

ఆదరిస్తారు. ఇలాంటి అన్యాయాలు చేస్తే ప్రజలే గుణపాఠం చెప్తారని అన్నారు. రాబోయేది జగన్ 2.0 పాలన. మళ్లీ అధికారంలోకి వస్తాం. అందరి లెక్కలు తేలుస్తాం. అన్యాయాలు ఎవరు చేసినా వదిలిపెట్టం. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతాం. మన పాలనలో రెండున్నరేళ్లు కోవిడ్ ఉంది అందుకే కార్యకర్తలకు చేయాల్సింది చేయలేకపోయాం. జగన్ 2.0లో ప్రతీ కార్యకర్తకు తోడుంటాం. వాళ్ల ఇంటి పెద్దన్నగా వారికి తోడుగా ఉంటా' అని వైఎస్ జగన్ మరోసారి ఉద్ఘాటించారు. ఈ భేటీకి హాజరైన మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, విడదల రజని, ఎంపీ అయోధ్య రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి, కాసు, బొల్లా సహా నియోజకవర్గాల సమన్వయ కర్తలు తదితరులు హాజరయ్యారు. అలాగే.. ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కోళ్ల బర్డ్‌ఫ్లూపై అధికారుల అలర్టు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోళ్ళకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి మరణిస్తుండటంతో తెలంగాణ అధికారులు అలెర్ట్ అయ్యారు. తెలంగాణా ప్రజలు చికెన్ తక్కువగా తినాలని, అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అయితే తెలంగాణాలో బర్డ్ ఫ్లూ లేదని, ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు సైతం చెప్తున్నారు. అయినప్పటికీ పలు జాగ్రత్తలు తీసుకుంటున్న తెలంగాణా ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ఆంధ్ర నుండి తెలంగాణకు వచ్చే సరిహద్దుల్లో తనిఖీలు పెంచింది. కోదాడ మండలం రామాపురం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ కొనసాగుతుంది. ఈ నెల 7తారీకు నుండి రాష్ట్ర బార్డర్ చెక్ పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి బర్డ్ ఫ్లూ లేకపోయినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వ్యాధి వ్యాప్తించకుండ చర్యలు తీసుకుంటున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులు కోళ్ళ ఫారాలను సందర్శించి రైతులకు సూచనలు చేస్తున్నారు. దాణా తెచ్చే వాహనాలు సైతం శానిటైజ్ చేసి కోళ్ళ ఫారాలకు అనుమతించాలని, శానిటైజ్ చెయ్యకుంటే ఇబ్బంది వస్తుందని అంటున్నారు.ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాలేదని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి వెల్లడించారు. ఇప్పటివరకు అందిన వివరాల ప్రకారం ఇతర కారణాలతో కోళ్లు మరణించినట్టు ఆయన పేర్కొన్నారు. చికెన్ తినొచ్చా? అధికారులు చెప్తుందిదే తెలంగాణ రాష్ట్రంలో చికెన్ తినడం వల్ల ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో చికెన్ తినకూడదని తప్పుడు ప్రచారం జరుగుతుందని, ఆ ప్రచారాన్ని నమ్మవద్దని వెల్లడించారు.వరంగల్, ఖమ్మం జిల్లాలో కోళ్ల మృతి పైన రక్త నమూనాలను ల్యాబ్ కు పంపించామని, అవి ఇతర కారణాలతో మృతి చెందినట్లు తేలిందని ఆయన అన్నారు బర్డ్ ఫ్లూ పై పౌల్ట్రీ రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు.



# బిసిలను అణచాలని చూస్తే ఊరుకోం

### బిసి లెక్కలన్నీ తప్పుల తడకలే

### మేధోమథన సదస్సులో తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఎవరైనా బీసీ జాతుల గొంతు మీద కాలు పెడతామని అంటే ఊరుకోం బిడ్డా.. మీ అంతు చూస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు చేశారు. బంజారాహిల్స్ కళింగభవన్‌లో తెలంగాణ ప్రభుత్వ కులగణన సర్వే రిజర్వేషన్ల పూర్వాపరాలు, సమస్యలు, ఆందోళనకర అంశాలు, పరిష్కార మార్గాలు అంశంపై బుధవారం మేధోమధన సదస్సు నిర్వహించారు. -పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ అల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు తీన్మార్ మల్లన్న హాజరై ప్రసంగించారు. మనం ఇప్పటి వరకు కులగణనలోని లోపాలను సమాజం ముందు పెట్టినం.. ప్రభుత్వం చేసిన బీసీ లెక్కలు తప్పు అనడానికి అనేక విధాలుగా ప్రజల ముందు ఉంచామన్నారు. ప్రభుత్వం బీసీ లెక్కల తప్పిదాలను ఎప్పుడు సరిచేస్తదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల ఆర్థిక పరమైన లెక్కలు కూడా బయటికి రావాలని.. 2 లక్షల 91 వేల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు సగం రావాల్సిందేనన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి కూడా బీసీలపై జరిగిన ఆర్థిక దోపిడి అంశాన్ని చర్చకు తీసుకోవాలని.. బీసీలకు జరిగిన అన్యాయన్ని అన్ని రంగాల్లో లెక్కలు తీస్కొని ప్రజలకు వివరించాలని కోరారు. బీసీలకు సీట్లు పార్టీలు వేసే బిచ్చమ్ అని.. అదే రిజర్వేషన్స్ మాత్రం రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలనే గెలిపించాలి.. ఆ దిశగా మనం ప్రణాళిక రచించాలి.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైండ్ బ్లాక్ అయ్యే రిజల్ట్ ఉండాలని బీసీలకు మల్లన్న పిలుపునిచ్చారు. బీసీల కోసం గొంతెత్తి నాకు పార్టీ నోటీసులు ఇస్తే.. ఈ సభ నాకు మద్దతుగా నిలిచిందని ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్స్ సాధించడమే మా అందరి అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## సచివాలయంలో పెచ్చులూడి కారు ధ్వంసం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సచివాలయంలోని ఐదో ఫ్లోర్ సౌత్ భాగంలోని పట్టీ కూలింది. దీంతో రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ వాహనం దెబ్బతింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడడం తో పెను ప్రమాదం తప్పింది. పట్టీ మొత్తం కూలే అవకాశం ఉండడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే సచివాలయంలో అక్కడక్కడ వాటర్ లీకేజీ అవుతుండడంతో గోడలు పెచ్చులూడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం సచివాలయ నిర్మాణానికి రూ.1200 కోట్ల ఖర్చు కాగా, ఈ నిర్మాణం నాసిరకం అంటూ అప్పట్లో కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సచివాలయం ప్రారంభం రోజే అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వం సచివాలయ నిర్మాణంపై విమర్శలు చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ డిఎస్పీ

### ఎమ్మెల్సీ అభ్యర్థిగా తప్పుకునే చాన్స్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ఎం. గంగాధర్ బుధవారం ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర్ ఇంకా నామినేషన్ ఉప సంహరించుకోలేదు. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఇటీవల డిఎస్పీ పదవికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీనియర్ కాంగ్రెస్ నేత వి.హన్మంతరావుతో పాటు సచివాలయానికి వచ్చిన గంగాధర్ కు మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికార అభ్యర్థి డాక్టర్ వి. నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని మంత్రి ఆయనకు సూచించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**రాజన్నసిరిసిల్ల,(క్రైమ్ మిర్రర్):** దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండలం, ముస్తాఫానగర్ అటవీ ప్రాంతంలో కోనరావుపేట మండలానికి చెందిన గంట కొమురయ్య అనే వ్యక్తి దుప్పిని వేటాడి చంపి, ముక్కలుగా చేసి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. అతని నుంచి 30 కేజీల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్ఓ శ్రీహరి ప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణులను ఎవరు వేటాడినా ఉపేక్షించేది లేదని, వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

## వనపర్తి జిల్లాకు ఐటి టవర్ మంజూరు

### ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** వనపర్తి జిల్లాకు ఐటి టవర్ మంజూరు అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. బుధవారం బిఆర్ అంబేద్కర్ సచివాలయ మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశంలో జి. చిన్నారెడ్డి ఐ.టి టవర్ మంజూరు అంశాలను వెల్లడించారు. వనపర్తి లో ఐటీ టవర్ నిర్మాణం కోసం రూ 22 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఐ టీ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలోని రెండు ఎకరాల స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 25 వేల చదరపు అడుగులలో ఐటి టవర్ భవన నిర్మాణం జరుగుతుందని ఈ భవనంలో ఏకకాలంలో 250 మంది ఐటి ప్రొఫెషనల్స్ పనిచేసుకునే సౌకర్యం ఉంటుందని చిన్నారెడ్డి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ఐటి హబ్‌లను అభివృద్ధి చేయడంలో భాగంగా వనపర్తికి ఐటి టవర్ మంజూరు అయ్యిందని, సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి సౌకర్యం కల్పించేందుకు ఈ ఐటి టవర్ ను వనపర్తి లో ఏర్పాటు చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి కి మంజూరైన ఐటి టవర్‌ను ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. ఐటి ప్రొఫెషనల్స్‌కు ఐటి టవర్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని వనపర్తి జిల్లాకు ఇది శుభవార్త అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

## కులగణన సర్వే తప్పని ఒప్పకున్నట్లే

### మరోమారు సర్వేకు ఆదేశాలపై కెటిఆర్ వ్యాఖ్య

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కులగణన సర్వే తప్పుల తడక అని తేలిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. మరోమారు సర్వేలో అయినా ఖచ్చితంగా నిర్వహించాలని అన్నారు. సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల కేటీఆర్ స్పందించారు. కులగణన సర్వే తప్పుల తడకని ప్రభుత్వం ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. అసంపూర్తి లెక్కలతో అసెంబ్లీలో తీర్మానం తప్పేనని అంగీకరించాలని, మనో వేదనకు గురిచేసినందుకు బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండోసారి అయినా సర్వే సమగ్రంగా చేయాలని సూచించారు.

# వరంగల్ వచ్చే ధైర్యం చేయని రాహుల్

### ప్రజలు నిలదీస్తారనే భాయంతో పారిపోయారు

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ వచ్చే ధైర్యం లేక పారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలపై నిలదీస్తారనే భయంతో రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. వరంగల్ లో రాహుల్ గాంధీ చ్చిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోబోరని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మకం లేక ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారని విమర్శించారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి చిలుక పలుకులు పలికారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు. సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదు . రేవంత్ రెడ్డి మహిళలకు రూ .35 వేల చొప్పున బాకీ పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని అన్నారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగుతున్నాయి,రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదని ఆరోపించారు.భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ పై అక్కసుతో కేసీఆర్ కిట్ లను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తుందని కవిత దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారని, బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఈ నెల 15 న మహావీర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించనున్నారు. ఏటా ప్రభుత్వం అధికారికంగా దీనిని నిర్వహిస్తోంది. ఉత్సవాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క, గిరిజన సంఘాల ముఖ్య నాయకులు కలిశారు. ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం అందించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## 2 లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్చండి

### అప్పుడే ఓట్లు అడగడానికి రావాలి

### బిజెపి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

**వేములవాడ, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు కల్పించిన తర్వానే ఓట్లు అడగాలని బిజెపి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ఓటు అడగాలని, 7500 కోట్లు ఫీజు రీయింబర్స్ ఇప్పించిన తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఓట్లు అడగాలన్నారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా వేములవాడలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మీడియా సమావేశలంఓ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజి రెడ్డి మాట్లాడుతూ.. మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ లో 12 లక్షల 75 వేల పన్ను మినహాయింపు ఇచ్చింది..చాలా మందికి వేసులు బాటు లభించింది?60 ఏళ్ల నుండి కానిది మోడీ కి దక్కింది..ఒక్క ఉద్యోగికి లక్ష రూపాయలు లాభం ఉందన్నారు.60

# నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రతిపాదించిన ఇసి

### తీవ్రంగా వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు

### ఏకగ్రీవాల పేరుతో దందాలను అరికట్టాలన్న ఇసి

### రాజకీయ పార్టీలతో భేటీఓ కుదరని ఏకాభిప్రాయం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్ద అనే అంశం రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయింది. కాంగ్రెస్ పార్టీ ఈ పద్ధతిని వ్యతిరేకించగా బిఆర్ఎస్ పార్టీ స్వాగతించింది. బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘంకి ఆ అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పింది. సిపిఎం నోటా ఉండాలని.. కానీ అభ్యర్థిగా గుర్తించోద్దని స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ లతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయింది. ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటా ను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా పెట్టాల వద్దా అనే అంశం రాజకీయ పార్టీ ల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీ ల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిపాదనలు పెట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను 'కల్పిత ఎన్నికల అభ్యర్థి'గా పరిగణించడం, పోటీ చేస్తున్న అభ్యర్థి , 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించడం. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా కంటే తక్కువ ఓట్లు పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరూ ఎన్నికైనట్లు ప్రకటించబడరు. ఎవరు ఎన్నిక కానట్లు అయితే, ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించబడుతుంది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు? తిరిగి ఎన్నికలో, నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే, తదుపరి ఎన్నికలు నిర్వహించబడవు, అత్యధిక ఓట్లు ఉన్న పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించబడుతుంది. ఈ ప్రతిపాదనలు పై రాజకీయ పార్టీ లు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని వ్యతిరేకించింది? నోటా ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్ళీ నిర్వహించాలని అంటే అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అన్నారు. ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందనీ ఆ పార్టీ పేర్కొంది. సుప్రీంకోర్టు లో కేసు ఉందని మా అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని బీజేపీ అంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదనీ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వం అని స్పష్టం చేసింది. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పింది. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తె రీ ఎలక్షన్ కరెక్ట్ కాదనీ సిపిఎం చెప్పింది?.తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని టిటిడీపీ చెప్పగా సింగల్ కాండిడేట్ ఉన్నా నోటా ఉండాలన్న జనసేన పార్టీ.. చెప్పింది. రాష్ట్రంలో సర్పంచ్ పదవుల వేలంను అరికట్టడానికి కల్పిత అభ్యర్థి

నిర్ణయం అని రాష్ట్ర ఎన్నికల సంఘం అంటుంది. ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు కల్పిత అభ్యర్థి విధానం ను అవలంభిస్తున్నాయని ఎన్నికల సంఘం రాజకీయ పార్టీ ల ముందు పెట్టింది.



## కేసులను తప్పదోవ పట్టించే యత్నం

### ఆరోపణలు, ఎదురుదాడలతో బిఆర్ఎస్ డ్రామా

**మొ**గుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు బిఆర్ఎస్ అన్ని వర్గాలకు ప్రాతనిధ్య పార్టీగా ప్రచారం చేసుకుంటోంది. రైతులపట్ల ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తోంది. వారి సమస్యలపై జిల్లాల వారీగా పోరాటాలు చేస్తోంది. ధర్నాలు చేస్తోంది. హాస్టళ్లలో పురుగుల అన్నం అని గగ్గోలు పెడుతోంది. బిసిలకు కాంగ్రెస్ ద్రోహంచేస్తోందని అంటోంది. జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని అంటోంది. గ్రామీణ వైద్యులకు అన్యాయం జరిగిపోయిందని వారి ధర్నలకు మద్దతు ప్రకటించింది. ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలో సకల సమస్యలన్నీ కాంగ్రెస్ వల్లనే పుట్టుకు వచ్చాయని ప్రచారం చేసి, ఆయా వర్గాలను దువ్వే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గతంలో ప్రజల్లోకిరాకుండా, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా, తొమ్మిదిన్నరేళ్లు నిరంకుశంగా పాలించిన బిఆర్ఎస్ ఇప్పుడు చిలకపలుకులతో బయలుదేరింది. ఓవైపు తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ ఏడాది రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని వలపోస్తున్నారు. అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదితరాల్లో అవినీతి గుప్పుమంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వస్తామని అన్నారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకనో బిఆర్ఎస్ దూరంగా ఉంది. ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేందుకు అవకాశం ఉందని అంటున్నారు. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. అయనపై ఎసిబి విచారణ సాగుతోంది. మొత్తంగా అవినీతి కేసుల్లో బిఆర్ఎస్ నేతలు బయటపడతారా లేక విచారణతో కాలయాపన చేస్తారా అన్నది చూడాలి.

## అయోధ్య ప్రధాన పూజారి కన్నుమూత

### ఆచార్య సత్యేంద్ర కుమార్ దాస్ మృతి చెందినట్లు ధృవీకరణ



అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి, అయోధ్య ధామ్ ఆచార్య సత్యేంద్ర కుమార్ దాస్ మహారాజ్ బుధవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. 83 ఏళ్ల వయసున్న పూజారి.. ఫిబ్రవరి 3న బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి లక్నో సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో చేరారు. తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతున్న ... ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఆచార్య సత్యేంద్ర దాస్ ఈ నెల ప్రారంభంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయనను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి సంతాపం తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేసిన సమయంలోనూ రామమందిరానికి పూజారిగా ఉన్నారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సమయంలోనూ సత్యేంద్రదాస్ కీలక పాత్ర వహించారు. అయోధ్య రామాలయం ప్రధాన పూజారి సత్యేంధ్ర దాస్ 20 ఏళ్ల వయస్సులోనే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నారు. సత్యేంద్ర

దాస్ 34 సంవత్సరాలుగా శ్రీరామ జన్మభూమిలో ప్రధాన పూజారిగా పనిచేస్తున్నారు. ఆయన 1945 మే 20న ఉత్తరప్రదేశ్‌లోని సంత్ కబీర్ నగర్ జిల్లాలో జన్మించారు. సత్యేంద్ర దాస్ తన గురువు అభిరామ్ దాస్ జీ ప్రభావంతో 1958లో అంటే 13 ఏళ్ల వయస్సులో సన్యాసం స్వీకరించారు. అప్పటి నుంచీ ఆయన తన ఇంటిని వదిలి ఆశ్రమంలో నివసించారు. నిర్వాణి అఖాడకు చెందిన దాస్, అయోధ్యలో అందుబాటులో ఉండే సాధువులలో ఒకరు. అయోధ్యతో పాటు, రామాలయంలో జరుగుతున్న పరిణామాలపై... దేశవ్యాప్తంగా అనేక మంది మీడియా వ్యక్తులకు అందుబాటులో ఉండే వారు. రామమందిర ఉద్యమం, ముందుకు సాగే మార్గంపై మీడియా అడిగిన అన్ని ప్రశ్నలకు దాస్ చాలా ఓపికగా సమాధానాలిచ్చేవారు. కూల్చివేత తర్వాత కూడా, దాస్ ప్రధాన పూజారిగా కొనసాగారు. రామ్ లల్లా విగ్రహానికి తాత్కాలికంగా ప్రతిష్ఠించినప్పుడు పూజలు చేశారు.




## కులాల కుంపట్లో చలికాచుకుంటున్న రాజకీయ పార్టీలు !

**ఏ**రోజుకు ఏది అవసరమో అది మాట్లాడడం..ఆయా వర్గాలను ఆకట్టుకునేలా చెప్పడం రాజకీయ పార్టీలకు షరా మామూలు అయ్యింది. దేశంలో బడుగు,బలహీన వర్గాలతో పాటు, నిమ్న వర్గాలను దువ్వడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. తాజాగా ఇప్పుడు ఎస్సీవర్గీకరణ, బిసి కులగణన వ్యవహారం నడుస్తోంది. ఈ రెండు వర్గాలను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీలు జెండాలెత్తుకున్నాయి. తామే వారికి రక్షణ కవచమని, వారి అభ్యున్నతే తమ రాజకీయం అని చెబుతున్నాయి. తెలంగాణలో బిసి కులగణన సరిగా జరగలేదని బిజెపి, బిఆర్ఎస్ వాదిస్తున్నాయి. పక్కా ప్రణాళికతో చేపట్టామని కాంగ్రెస్ చెబుతోంది. ఎవరు కరెక్ట్..ఎవరు రాంగ్ అన్నది ఆయా వర్గాల ప్రజలు విశ్లేషించుకుంటున్నారు. నిజానికి ఏ పార్టీ కూడా ఈ కులాలకు పెద్దపీట వేయడంలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా దళితుడైన మల్లికార్జున ఖర్గే ఎన్నికైనా అది పేరుకు మాత్రమే. పెత్తనం, వ్యవహారమంతా రాహుల్, సోనియా, ప్రియాంకల గుప్పిట్లో ఉంది. అదో కుటుంబ పార్టీగా మారింది. బిఆర్ఎస్‌లో అయితే పక్కా కుటుంబ పార్టీయే. టిడిపి కూడా మరీ కుటుంబ పార్టీ అనక తప్పదు. వీరంతా ఇప్పుడు కులాల ఉద్ధరణకు వీరతాళ్లు వేసుకున్నారు. బిసిలపై కాంగ్రెస్‌కు ప్రేమలేదని, వారిని మోసం చేశారని తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్‌లు అంటున్నాయి. అందుకే ఇప్పుడు బిజెపి కూడా బిసి అధ్యక్షుడిని చేస్తుందన్న ప్రచారం ఉంది. కాంగ్రెస్ ఇప్పటికే బిసిని అధ్యక్షుడిగా చేసేసింది.బిఆర్ఎస్‌లో ఆ ఛాన్స్ లేదు. అక్కడ వెలమదొరలు తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. టిడిపిలో చంద్రబాబు కుటుంబం తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. ఇలా పార్టీల్లోనే న్యాయంచేయలేని వారు ఎస్సీ, బిసిలకు న్యాయం చేస్తామంటే నమ్మడం ఎలా అన్నదే సమస్య. దేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సమాఖ్యలు అన్నీ అగ్రవర్ణాల నాయకత్వంలోనే నడుస్తున్నాయి. కమ్యూనిస్టుల్లో కూడా అగ్రకులాలదే పెత్తనం అని వేరుగా చెప్పనక్కరలేదు. తమ గుప్పిట్లో అధికారం ఉండాలి...కానీ తము మాత్రం కింది కులాల వారికి అండగా ఉన్నామని చెప్పుకోవాలన్న తలబిరుసుతనంతో ఆయా పార్టీల నేతలు ఉన్నారు. అందుకే పార్టీ నాయకత్వ మైనా, అధికార పెద్దరికమైనా చేజారిపోకుండా జాగ్రత్త పడుతూనే ఉంటారు. ఇప్పటికీ తక్కువ కులాల్లో జాతి వివక్ష కొనసాగుతోంది. దీనిని తొలగించి వారిని సమాజాంలో అందరితో సమానంగా చేయడానికి ప్రయత్నాలు సాగడం లేదు. అంతెందుకు కులవ్యవస్థ నిర్మూలనకు ఎవ్వరూ పోరాడడం లేదు. కులాల పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అలవాటు పడ్డ వీరు కలుఆలను సజీవంగా కొనసాగించేలా చేస్తున్నారు. బడుగువర్గాల, శ్రమజీవుల ప్రతినిధులమని చెప్పుకొనే పార్టీల్లో కూడా ఈ జాడ్యం కొనసాగడం దారుణం. మరోవైపు అగ్రకుల అధిపత్యానికి విరుద్ధంగా..పాలనలో తమ వాటా, భాగస్వామ్యం కోసం దేశం లోని బిసిలు, దళితులు గట్టిగా పోరాడలేక పోతున్నాయి. కాన్షీరామ్ బిఎస్‌పి స్థాపించి సంచలనం సృష్టించినా, అధికార యావలో ఆ పార్టీ కొట్టుకుపోయింది. అంతెందుకు తెలంగాణలో దళిత ఉద్ధరణ అంటూ బయలుదేరి బిఎస్‌పిలో చేరిన ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా అధికార యావలో బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పిన ఆయన చివరకు అదేపార్టీ చంకనెక్కారు. అంటే ఏదో ఒక డబ్బున్న పార్టీలో చేరితే తప్ప మనుగడ లేదని ఆయన గుర్తించివుంటారు. నిజానికి బిసిలు సమగ్ర కులగణన కోరుతున్నారు. మాదిగలు ఎస్‌సి రిజర్వేషన్లలో తమ వాటా తేల్చమంటున్నారు. తాజాగా ఎబిసిడి వర్గీకరణ జరగాలని మందకృష్ణమాదిగ కోరుతున్నారు. వీరి డిమాండ్లు క్రమంగా రాజకీయ ప్రాధాన్యతను పొందాయి. గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు వీటి ప్రస్తావన తేక తప్పలేదు. తాజాగా ఇప్పుడు పంచాయితీ ఎన్నికలు రావడంతో అన్నిరాజకీయ పార్టీలు బిసిలకు తామే

ప్రతినిధులం అన్నట్లుగా బయలుదేరాయి. తొమ్మిదన్నరేళ్లు అన్ని వర్గాలను అణగదొక్కి, తెలంగాణ పేరు చెప్పి దోచకున్న బిఆర్ఎస్ నేతలుకూడా బిసిలపట్ల ఎక్కడ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో గెలిపిస్తే దేశంలో బిసిల కులగణన చేపడతామని రాహుల్ గాంధీ చెబుతూ వచ్చారు. ఎస్‌సి రిజర్వేషన్లలో మాదిగలకు న్యాయం చేస్తామని భరోసా ఇస్తూ ప్రధాని మోడీ ఎన్నికల ప్రచార వేదికపై మందకృష్ణ మాదిగ కన్నీళ్లు తుడిచారు. నిజం ఏమిటంటే ఈ రెండు సమస్యలు రాజకీయ క్షేత్రంలో పావులుగా వాడుకోవడానికి అన్ని పార్టీలకు ఉపయోగపడుతున్నాయి. ఏ ప్రధాన రాజకీయ పార్టీకి వీరి డిమాండ్ల పట్ల చిత్తశుద్ధి లేదనడంలో సందేహం లేదు. తమ రాజకీయ నిచ్చెనను ఎక్కడానికి వీరు మెట్లుగా ఉపయోగపడతారు కాబట్టి వారి గురించి మాట్లాడుతున్నారు. వారి సమస్యలను అధ్యయనం చేసి, వారి ఆకాంక్షలను నెరవేర్చి ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడాలన్న ఆసక్తి ఏ రాజకీయపార్టీకి లేదనే చెప్పాలి. పైగా వారిని ఎదగకుండా చేసి, ఉన్నచోటనే ఉంచి అవసరానుగుణంగా వాడుకోవాలన్న రాజకీయ దురుద్దేశం కూడా ఆయా పార్టీ నేతలకుంది. దేశంలోని బిసిలు, మాదిగలు కోరుకుంటున్న విధంగా విధాన కల్పన చేయాలనీ ఏ ప్రభుత్వానికి లేదు. కింది కులాలు ఎదిగి తమ పీఠాలు కదిలించకుండా సకల జాగ్రత్తలు ఆ నాయకులు తీసుకుంటారు. నిజానికి దేశం అభివృద్ధిలో పయనించాలంటే పేద, ధనిక వర్గాలను గుర్తించి వారికి పథకాలు అందచేయాలి. దళిత,బిసి వర్గాలను గుర్తించి వారి ఆర్థిక స్థోమత ఆధారంగా పతకాలు రచించాలి. విద్య,ఉద్యోగ రంగాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయంగా వారిని భాగస్వాముల ను చేయాలి. కులనిర్మూలన చేసి భారతజాతిని ఏకంచేయాలి. అలాచేసే ధైర్యం ఉందా అన్నది చెప్పాలి. కులాల కుంపట్లు రాజేసి రాజకీయ లబ్ది పొందే రాజకీయ స్వార్థ పరుల పట్ల ఆయా కులాల వారు జాగ్రత్తగా ఉండడం ఎప్పటికీ అసరం.

(ఆధ్యాత్మిక చింతన)



## మాఘ పౌర్ణమితో కుంభమేళాలో పుణ్యస్నానాలు

### లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

**మా**ఘ పూర్ణిమ సందర్భంగా మహా కుంభమేళాకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి దాదాపు కోటిమంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఇంకా లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. పౌర్ణమి ప్రత్యేక మైన రోజు కావడంతో లక్షలాదిగా తరలివచ్చారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యూపీ ప్రభుత్వం అప్రమత్తం అయింది. కట్టుదిట్టమైన భద్రత కల్పించింది. ఇంకోవైపు యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ స్వయంగా పరిస్థితుల్ని సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన దుర్ఘటనలు తిరిగి జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎక్కడికక్కడే పోలీసులు మోహరింపజేశారు. ఇదిలా ఉంటే ప్రయాగ్‌రాజ్‌లో ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాగున్నాయంటూ కితాబు ఇస్తున్నారు. మహా కుంభమేళా ఫిబ్రవరి 26 మహాశివరాత్రి వరకు కొనసాగనుంది.



తెలంగాణలో పంచాయితీ ఎన్నికల వేళ కుటగణన చిచ్చురేపుతోంది. పార్టీపరంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అందిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో ప్రకటించారు. అన్ని పార్టీలు ఇలాగే చేయాలన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టాలని బిజెపి, బిఆర్ఎస్ చేసిన డిమాండ్ ముందుకు రాలేదు. సుప్రీం తీర్పు మేరకు రిజర్వేషన్లు 50శాతం మించరాదు. దీంతో బిల్లు పెట్టే ప్రసక్తి ఉండదు. కానీ రాజకీయంకోసం బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఇప్పుడు అదే నినాదంతో ఊరూవాడా ఊరేగుతోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టింది. అది ఏ మేరకు చట్టబద్ధతతో, ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో కాలమే చెప్పాలి. ఇప్పటికే ఓట్ల కోసం బిసి లెక్కలు వేసిన కర్ణాటక, బీహార్, ఎపి రాష్ట్రాలు బిసి జనాభాకు కొత్తగా చేసిందేమీ లేదు. తెలంగాణలో బిసిలను, మాదిగలను మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో బిజెపిక దూకుడు పెంచింది. వారికి తామే వారసులం అన్నరీతిలో ప్రకటనలు చేస్తున్నారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలు ఎస్‌సి రిజర్వేషన్లను ఉపకులాలకు పంచవచ్చని సుప్రీకోర్టు చెప్పింది. తెలంగాణ ఈ విషయంలో రెండు అడుగులు వేసింది కాబట్టి ఆయా నేతలతో వాటి అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి అనే వ్యూహంలో ఉన్నాయి. అందుకే ఒకరికి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి, మరొకరికి పద్మశ్రీ ఇచ్చింది. తెలివిగా బిసి ఉద్యమనేత కృష్ణయ్యకు రాజ్యసభను, ఎస్సీవర్గీకరణ కోసం పోరాడిని మందకృష్ణకు పద్మశ్రీని ప్రకటించింది. ఇది రాజకీయ లబ్దికోసంచేసిందే తప్ప ప్రేమతో చేసింది కాదు. ఒకరికి పద్మశ్రీ, మరొకరికి రాజ్యసభ పదవి కట్టబెడితే ఆయా నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గాలకు లభించేదేమిటన్నదే ప్రశ్న.

## పంచాయితీ ఎన్నికల వేళ కులాల బుజ్జగింపులు

### బిఇ, ఎస్సీలను దువ్వుతున్న రాజకీయపార్టీలు

### చట్టపరంగా సీట్లు ఇచ్చే ధైర్యం చేస్తాయా అన్నదే సమస్య



కేంద్రం చొరవలేకుండా జనాభా లెక్కలకు విలువ లేదని రాష్ట్రాలకు కూడా తెలుసు. జనాహభా లెక్కల ద్వారానే బిసిల లెక్కలు తేల్చాలన్న డిమాండ్ కూడా ఉంది. ఎస్‌సి రిజర్వేషన్లలో విభజనను రాష్ట్రాలు చేసుకో వచ్చని సుప్రీం కోర్టు తేటతెల్లం చేసింది. దీంతో తెలంగాణలో ఓ అడుగు ముందుకు పడింది. అయితే అది సమగ్రంగా లేదని తాజాగా మందకృష్ణ అంటున్నారు. ఎబిసిడి వర్గీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 2024లో సుప్రీం ఈ మాట చెప్పినా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఒక్కటి కూడా రిజర్వేషన్ల అంశంపై చర్చించడం లేదు. ఆయా రాష్ట్రాల్లో ఒత్తిడి కూడా కనిపించడం లేదు. తెలంగాణలో మాత్రమే ప్రభుత్వం అధ్యయన కమిటీని వేసి, 60 రోజుల్లో దళిత ఉపకులాల లెక్కల నివేదిక ఇవ్వాలని అక్టోబర్ 2024లో ఏకసభ్య కమిషన్ నియమించింది. నివేదిక రావడంతో అసెంబ్లీలో దీనిని ప్రవేశ పెట్టారు. ఆమేరకు రిజర్వేషన్లు ప్రకటించారు. కులాల పరంగా వారికి న్యాయం చేయకుండా ఇలాంటి డ్రామాలు చేస్తున్నారు. ఇవ్వాళ్ళ ఈ గౌరవాలు ఇచ్చిన ప్రభుత్వం తమ డిమాండ్లను కూడా సానుకూలంగా పరిష్కరిస్తుందని భరోసా ఇవ్వగలరా. ఇప్పుడు బిసిలకు గాని, మాదిగలకు గాని వారి డిమాండ్లపై నిజాయితీగా పోరాడే కొత్త శక్తితో వీరు ముందుకు రావాలి. రాజకీయంగా సాధించే పటిమను ప్రదర్శించాలి. పంచాయితీ ఎన్నికల్లో ఆయా వర్గాలు తమ డిమాండ్లపై దృష్టి పెట్టి రాకీయ పార్టీల మెడలు వంచాలి.

# ఘనంగా గాంధీజీ సంస్థలో అబ్బుర పరిచిన విద్యార్థుల స్వపరిపాలన దినోత్సవం

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ ...

## విద్యార్థుల స్వయం అనుభవం కోసమే స్వపరిపాలన దినోత్సవం

## ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు





**క్రైమ్ మిర్రర్,నాంపల్లి:** విద్యార్థులకు స్వయం అనుభవం కోసమే స్వపరిపాలన దినోత్సవంను నిర్వహించినట్లు నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. గాంధీజీ విద్యాసంస్థలలో బుధవారం రోజు నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించడంలో నాంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన వీధులలో జరిగిన సీఎం కాన్వాయ్ లో సీఎం, మంత్రులు నిజంగా నాంపల్లికి వచ్చారా అని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మంత్రులుగా నటించిన విద్యార్థులు త్వరలోనే నాంపల్లిలో బస్టాండ్ ఏర్పాటు, రెవిన్యూ డివిజన్ ఏర్పాటు, 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెండు వరుసలలో ప్రధాన రోడ్లు లైటింగ్ తో ఏర్పాటు అవుతాయని వాగ్దానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక్కరోజు పాలనలో విద్యార్థులు నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా తమ పాత్రలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని వారు ఆకాంక్షించారు. స్వయం పరిపాలనలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు కలెక్టర్, డీఈవో, ఎం ఈ ఓ లు గా, ప్రజాప్రతినిధులుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ విద్యార్థులను ఎంతగానో ఆకర్షించింది. స్వపరిపాలన దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ స్వపరిపాలన దినోత్సవం లో సీఎంగా వర్షిత్, డిప్యూటీ సీఎం గా వరుణ్ తేజ్, ఆర్థిక శాఖ మంత్రిగా ధనలక్ష్మి, విద్యాశాఖ మంత్రిగా షేల్ హుమేరా తబసుమ్, సినిమా ఆటోగ్రఫీ మంత్రిగా ధనుష్, వ్యవసాయ శాఖ మంత్రిగా కార్తీక్, ఎమ్మెల్యేలుగా వరుణ్, విగ్నేష్, కలెక్టర్‌గా నాఫిజా రుక్సానా, డీఈవోగా శ్రీజ, డిఎస్పీగా వినయ్ రెడ్డి, సీఐగా నరేందర్, కరస్పాండెంట్ గా వైష్ణవి, ప్రిన్సిపాల్ గా ఎం. శివ, డైరెక్టరుగా రెహమాన్, స్పీకర్ గా కావ్య, ప్రతిపక్ష నాయకులుగా యశ్వంత్ శర్మ, అరవింద్, మణికంఠ, ఎస్సైగా హరీష్ తమ తమ పాత్రలను అద్భుతంగా పోషించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యా సంస్థల డైరెక్టర్ సరి కొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపాల్ సామల వెంకటేశ్వర్లు, చిల్కూరి రామేశ్వరి, సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం

## సద్వినియోగం చేసుకున్న గ్రామస్తులు

## స్వేరో విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు:ఆకులపల్లి నరేష్

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండల పరిధిలోని కేతే పల్లి గ్రామంలో బుధవారం లేజర్ ఆప్టికల్స్ దేవరకొండ వారిచే స్వేరో విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి నరేష్ ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేతే పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతలలో ఉన్న ప్రజలు వ్యవసాయానికి ఇచ్చినటువంటి శ్రద్ధ, ప్రాముఖ్యతను తమ ఆరోగ్యలకు ఇవ్వరని పేర్కొన్నారు. సిటీలో ఉన్న ఆరోగ్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకోవచ్చిన సంఘ నాయకులకు అభినందలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చారి, సురేష్, నవీన్, స్కూలు ఉపాధ్యాయుడు గాదేపాక వేలాద్రి, కాశిమల్ల జంగయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

# ఉత్తమ వైద్యసేవ పురస్కారం అందుకున్న కాసం లింగయ్య

**చౌటుప్పల్ ఫిబ్రవరి 12, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి):** చౌటుప్పల్ మండల 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కాసం లింగయ్య పేషెంట్ లకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకుగాను ఉత్తమ వైద్య సేవ పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరుద్దీన్, ఈఎంఈ మహేష్ లు స్టార్ ఉత్తమ అవార్డును అందించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో 108 అంబులెన్సు పైలెట్ వెంకటేష్, పైలెట్ అభిలాష్ ఈఎంటి విశ్వం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసం లింగయ్య మాట్లాడుతూ.. తనకు ఉత్తమ పురస్కారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



# మిర్యాలగూడలో బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు: పశువైద్యాధికారి



క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ : తెలంగాణ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ (హెచ్పిఎఐ %-% హైలీ పాతోజెనిక్ ఏవియన్ ఇన్ఫ్లూ ఎంజా) లక్షణాలు ఇప్పటి వరకు మిర్యాలగూడ పట్టణం, మండలంలోని పౌల్ట్రీ ఫారాలలో కనబడలేదని ఆలగడప పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ నాయిని దుర్గా రమాదేవి స్పష్టం చేశారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం, సుబ్బారెడ్డిగూడెం, రాయినిపాలెం గ్రామాల్లో పౌల్ట్రీ ఫారాలను సందర్శించి కోళ్ల ఆరోగ్య పరిస్థితిని ఆమె సమీక్షించారు. పరిశీలన అనంతరం డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ..ప్రస్తుతం కోళ్లలో ఎటువంటి అనారోగ్య లక్షణాలు లేవు. అయితే, లక్షణాలు లేకుండానే కోళ్లు పెద్ద ఎత్తున చనిపోతే, వెంటనే సమీపంలోని పశువైద్యశాలకు సమాచారం అందించాలి అని సూచించారు. చనిపోయిన కోళ్లను రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా భద్రంగా పూడ్చిపెట్టాలని రైతులకు ఆమె సూచించారు. అలాగే, బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, కోడి మాంసం, గుడ్లు చక్కగా వండి తింటే ఏ ప్రమాదమూ ఉండదని ఆమె స్పష్టం చేశారు. పౌల్ట్రీ ఫారాలు నిర్వహించే రైతులు తగిన జాగ్రత్తలు పాటించి, కోళ్ల ఆరోగ్యంపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమాదేవి సూచించారు. అనుమానాస్పద లక్షణాలు గమనించిన వెంటనే పశువైద్య శాఖ అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు.



# కేజీబీవి లో పరీక్ష సామాగ్రి అందజేత

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని గుండ్ల సింగారం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ప్యాడ్లు, పెన్నులు,స్కేళ్లు , పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ మాట్లాడుతూ బాలికలు చదువులలో రాణించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు. ఈనాటి సమావేశంలో మూడ్ మోహన్ నాయక్ మరికంటి అశోక్, నాగు, పాఠశాల టీచర్లు , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వరి పొలాల్లో తెగుళ్లను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ :** మిర్యాలగూడ మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామంలో పలు వరి పొలాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి ధీరావత్ సైదానాయక్ సందర్శించి, తెగుళ్ల ప్రభావాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల అగ్గి తెగులు (బ్లాస్ట్) ముప్పు పెరుగుతున్నట్లు తెలిపారు. అలాగే, మెడ విరుపు తెగులు కూడా ప్రభావం చూపే అవకాశముందని ఆయన హెచ్చరించారు. దీనికి నివారణగా యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలని, అలాగే ట్రైసైక్లోజోలు 6 గ్రాములు, అజోస్ట్రోబిన్, మ్యాంగోజబ్ మందులను 2.5 గ్రాముల చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, కాండంతొలిచే పురుగు ఉధృతి అధికంగా కనిపించినట్టు గుర్తించిన ఆయన, దీని నియంత్రణకు కార్తప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ 1.5 గ్రాములు లేదా ఇన్సిపియో (ఐసోసైక్లోసరం) 6 మిల్లీలీటర్లను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అధిక యూరియా వినియోగం ఈ తెగుళ్లను మరింత పెంచే అవకాశం ఉన్నందున, రైతులు పొలాలు ఈత దశలో ఉన్నప్పుడు యూరియాను మితంగా ఉపయోగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రంగారెడ్డి, చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడికి ఘనంగా సన్మానం

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** రంగారెడ్డిజిల్లా శంకర్పల్లి ఫిబ్రవరి 12 భారత మాజీ కుటుంబ సురక్ష పథకంలో ప్రతి ఎక్స్ సర్వీస్ మెన్ చేరాలని తెలంగాణ రాష్ట్ర ఎక్స్ సర్వీస్ మెన్ ప్రతినిధి రమేష్ బాబు జగన్నాథం పేర్కొన్నారు. బుధవారం ఎక్స్ సర్వీస్మెన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అసోసియేషన్ టెన్ ఇయర్స్ సెలబ్రేషన్స్ 2025 సందర్భంగా సీనియర్ ఎక్స్ సర్వీస్ మెన్ ఆఫీసర్లకు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్యూటీలో ఉన్నవారు మరణాంతరం కూడా ఈ పథకంలో చేరిన వారి అందరికీ భవిష్యత్తులో చాలా ఉపయోగాలు ఉన్నాయి అన్నారు. వీటికి సంబంధించిన కరపత్రాలను అందరికీ అందించారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్ మాట్లాడుతూ దేశాన్ని కాపాడడానికి సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించే మీ కుటుంబాలకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులను విడుదల చేసి గౌరవించాలి అన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు జిలాని, జనరల్ సెక్రెటరీ బొబ్బిలి జగదీశ్వరరావు మాట్లాడుతూ హాజరైన హాజరైన మాజీ సైనికుల వీర గాధలను వారి హోదాలను చక్కగా వివరించారు. ఆ తర్వాత సేవ ఫౌండేషన్ అధ్యక్షులు నరేష్ గారిని శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్మీ కుటుంబాల మహిళలను అసోసియేషన్ కార్యదర్శి ముకుందరావు గౌరవ వందనం చేశారు.

# మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జీఎం



క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ : మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) అరుణ్ కుమార్ జైన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీబీనగర్%-%గుంటూరు రైల్వే మార్గంలో రెండో లైన్ ఏర్పాటుతో భద్రతా తనిఖీలు నిర్వహించే భాగంగా ఆయన స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాట్ఫామ్, టికెట్ బుకింగ్ కౌంటర్, పార్సిల్ విభాగాలను పరిశీలించారు. రైల్వే సిబ్బందికి అవసరమైన సూచనలు అందించడంతో పాటు స్టేషన్‌లో పారిశుద్ధ్యం, సేవల మెరుగుదలపై దృష్టి సారించాలని ఆదేశించారు. జీఎం వెంట గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణ, సీనియర్ డీసీఎం ప్రదీప్, డిఓఎం దినేష్ కుమార్, స్టేషన్ సూపరిండెంట్ తారకేశ్వర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తదితర అధికారులు ఉన్నారు.

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 గురువారం 13-2-2025





## 5 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం: ఆక్రమణలు తొలగింపు చర్యలు

**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 54, 55లో ఉన్న సుమారు 5 ఎకరాల భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిని శుభ్రం చేసి, ప్రభుత్వ అవసరాలకు వినియోగించనున్నట్టు మిర్యాలగూడ తహసీల్దార్ ఎన్. హరిబాబు తెలిపారు.బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడిన ఆయన, కొత్తగూడెం గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం, ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలు చోటుచేసుకున్నాయని, అలాగే పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగి చెత్తాచెదారం పేరుకుపోయిన పరిస్థితి ఉందని తెలిపారు.ఆ భూమిని ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని కోరిన తహసీల్దార్, భవిష్యత్తులో ఆ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలు లేదా విద్యాసంస్థల నిర్మాణానికి వినియోగించే ప్రతిపాదన ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు టి. రామకృష్ణ, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి ఎవరికి లేదు: కళ్లెం లక్ష్మారెడ్డి



**గండిపేట్(క్రైం మిర్రర్):** ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి ఎవరికి లేదని కళ్లెం లక్ష్మారెడ్డి అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం మీ స్వార్థం కోసం మీ సొంత పనులు చేయలేదని ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల కోసం మాట్లాడే అర్హత విమర్శించే వారికి లేదన్నారు. గత 25 సంవత్సరాల నుంచి ఎమ్మెల్యేతో సుధీర్ఘమైన ప్రయాణంలో ఉండి బాబుల్‌రెడ్డినగర్ బస్తీ వాసులకు వరగబెట్టింది ఏమి లేదన్నారు. మిమ్మల్ని నమ్ముకోని ఉన్న అనుచరుల కోసం ఏనాడు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అభివృద్ధి అనే నినాదంతో నిత్యం ప్రజల కోసం పాటుపడే ప్రకాష్‌గౌడ్‌ను విమర్శించే ముందు మీ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంవత్సర కాలంలో అనేకమైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజా సమస్యలను పరిష్కిరంచడంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముందున్నారన్నారు.

## విద్యార్థులు చక్కగా చదువుకోవాలి






**గండిపేట్(క్రైం మిర్రర్):** విద్యార్థులు చక్కగా చదువుకోని తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కష్టపడాలని నార్సింగి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ విజయబాబులు సూచించారు. నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట్ ప్రభుత్వ పాఠశాలలో పదవీ విరమణ పొందిన మున్సిపల్ చైర్మన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయబాబు, కౌన్సిలర్లు గంగిడి శివారెడ్డి, అరికె దుర్గేష్‌యాదవ్, నాగేష్‌లను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, ఎస్‌వీఎస్ యూత్ సభ్యులు మల్లారెడ్డి, శాంతిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకంగా అభివృద్ధి పనులు

### మున్నాళ్ల ముచ్చగా మిగులుతున్నాయి

### నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డిలు





**గండిపేట్(క్రైం మిర్రర్):** నాసిరకంగా అభివృద్ధి పనులు చేపట్టి చేతులు దులుపుకుంటుండడంతో అవి కాస్తా వారం రోజులకే శిథిలావస్థకు చేరుతున్నాయని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డిలు అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో వారు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల నిర్మించిన రహదారి, డ్రై నేజీ మ్యాన్‌హోల్ మూతల సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మ్యాన్‌హోల్స్ మూతలు సరిగ్గా అమర్యకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పనులను సరిగ్గా అధికారులు పరిశీలించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం లేదని, కాంట్రాక్టర్ చెప్పిన విషయాలను కూడా పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. ఈ పరిస్థితిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ ప్రజాధనం కాంట్రాక్టర్లకు అప్పగించేసి బాధ్యత లేకుండా వ్యవహరించడం క్షమించరాని విషయమన్నారు. పనుల పర్యవేక్షణ లేకుండా బిల్లులు చెల్లించడం అవినీతికి నిదర్శనమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారి, డ్రై నేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను, కాంట్రాక్టర్లను కఠినంగా విచారించాలన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మందకృష్ణమాదిగను సన్మానించిన ఖానాపూర్ ఎమ్మార్పీఎస్ నాయకులు

**గండిపేట్(క్రైం మిర్రర్):** మాదిగల అభ్యున్నతికి పాటుపడిన మందకృష్ణమాదిగ దళితుల గుండెల్లో ఎప్పటికి ఉండిపోతారని ఖానాపూర్ ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షుడు పెద్దపులి శంకర్ అన్నారు. బుధవారం మందకృష్ణమాదిగను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా, ఏబీసీడీ వర్గీకరణ సాధించినందుకు ఆయనను ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్లగారి గణేష్‌మాదిగ, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపుల్లి కృష్ణ( కిషన్ ) మాదదిగ, ఎమ్మార్పీఎస్ ముఖ్య సలహాదారులు లింగంపల్లి దేవదాస్, దప్పు రాకేష్, రామేశ్వరం రాందాస్, రవీందర్, దప్పు కృష్ణ, ఆర్.పోచయ్య తదితరులు పాల్గొన్నారు.







## కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

### బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు

గండిపేట్(క్రైం మిర్రర్): బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు అన్నారు. బుధవారం కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్రను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీలలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. దోమల బెడద తీవ్రంగా ఉందని దోమల నివారణకి వారానికి రెండుసార్లు దోమల నివారణకు అన్ని కాలనీలలో దోమల మందు పిచికారి చేయాలన్నారు. వారానికి రెండు రోజులు ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ మొత్తంలో కుక్కల బెడద తీవ్ర సమస్యగా మారిందని ప్రతి కాలనీలలో కుక్కల సమస్య తీవ్రంగా వేధిస్తుందని, నడుచుకుంటూ వెళ్తుంటే కుక్కలు వెంట పడుతున్నాయని, విద్యార్థులు స్కూలుకు నడుచుకుంటూ వెళ్తుంటే విద్యార్థుల పైకి కుక్కలు దాడి చేస్తున్నాయన్నారు. ఈ కాలనీ ఆ కాలనీ అని తేడా లేకుండా గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు,వృద్ధులు, సైకిల్, ద్విచక్ర,వాహనదారులపై వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయని రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వచ్చే వాహనదారులపై దాడులు చేస్తున్నాయన్నారు. కుక్కలు కనపడితే చాలు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.ఈ సమస్య తీవ్రత ను గమనించి తక్షణమే కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ కోరన్నారు. కొన్ని కాలనీలలో ఐమాస్ట్ లైట్స్ పనిచేయడం లేదని అదేవిధంగా వీధిలైట్లు కూడా పనిచేయడం లేదని తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలను, పార్కు స్థలాలను కాపాడాలన్నారు. క తక్షణమే సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వి.రాముడు యాదవ్, బీసీ సంఘం నాయకులు చందు గౌడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రవికుమార్,చంద్రరావు, శాంతి నాయక్, మల్లీశ్వరి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా అభివృద్ధి పరిచేందుకు కృషి: ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికి, దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని మైలార్‌దేవ్‌పల్లి నుంచి దుర్గానగర్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణంకు, ఆరాంఘర్ వద్ద రెండు ఆర్‌యుబిల నిర్మాణానికి గత ప్రభుత్వం 259 కోట్లతో ఈ రెండు పనులు మంజూరు చేసిందన్నారు. కానీ నిధులు మాత్రం విడుదల చేయలేదన్నారు. మైలార్‌దేవ్‌పల్లి నుంచి దుర్గానగర్ వరకు ప్రయాణించే వాహనాదారులు, ప్రజలు తీవ్ర ట్రాఫిక్‌తో ఇక్కట్లు పడుతున్నారని ట్రాఫిక్ సమస్య చాలా జఠిలంగా ఉందన్నారు. పాదాచారులు రోడ్డు దాటేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొద్ది దూరంలోనే ప్రయాణం అరగంట సమయం పడుతుందన్నారు. సమస్య తీవ్రతను తమ దృష్టిలో ఉంచుకోని నిధులు విడుదల తొందరగా చేయాలని సీఎంను కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు.



# ఎంజీఐటీ విద్యార్థిని సత్కరించిన భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి








గండిపేట్(క్రైం మిర్రర్): మహాత్మ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మూడవ సంవత్సరం విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ నేహశ్రీ అత్యుత్తమ కూచిపూడి నృత్య ప్రదర్శనలకు వివిధ సందర్భాలలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, తెలంగాణ గవర్నర్లు సత్కరించారు. జనవరి 26వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక గణతంత్ర దినోత్స పరేడ్లో పాల్గొని తెలంగాణ నుంచి ఎనిమిది మంది పాల్గొన వారిలో ఆమె ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.సుధాకర్రెడ్డి, ఎస్.పి.సింగ్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.బాల్రెడ్డిలు నేహశ్రీని అభినందించి సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులకు స్పూర్తిగా నిలవాలని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**గండిపేట్(క్రైం మిర్రర్):** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పివిఎన్ఆర్ ఎక్స్ప్రెస్వే పిల్లర్ నెంబర్ 322 వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 30%-%40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని గుర్తించామన్నారు. మృతుడి వివరాలు తెలుసుకునేందుకు స్థానికంగా వాకాబు చేయగా గత కొన్ని నెలల నుంచి పివిఎన్ఆర్ ఎక్స్ప్రెస్వే కింద ఆశ్రమం పొందుతూ స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాట్లు తెలిసిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చ్యూరికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## నీటి సరఫరాను పెంచి ప్రజలకు అందించాలి

### మాజీ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి

**గండిపేట్(క్రైం మిర్రర్):** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ లో మాజీ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం జలమండలి జీఎం మహేందర్నాయక్, మేనేజర్ శ్రీనివాస్లతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటించారు. వేసవి కాలంలో ప్రజలకు నీటి సమస్యలు ఉండకూడదని నీటిని ఎక్కువగా సరఫరా చేయాలని అధికారులను కోరుతున్నామన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కరెంటు ఉండని ప్రాంతాలు

**గండిపేట్(క్రైం మిర్రర్):** నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ ఆపరేషన్ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్స్టేషన్స్ మెయిటెనెన్స్ వర్క్, సమ్మర్ యాక్షన్ ప్లాన్లో భాగంగా ఫీడర్లల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ఇబ్రహీంబాగ్ సబ్స్టేషన్ పరిధిలోని ఉస్మాన్సాగర్ ఫీడర్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు రాందేవ్గూడ, ఇబ్రహీంబాగ్, నార్సింగి రోడ్, తారమతీబారదారి మెయిన్ రోడ్డు, మిట్రీ%-%1 ఫీడర్లో రాందేవ్ గూడ గ్రామం, వన్ మోర్నగర్ కాలనీ, నెక్నాంపూర్ గ్రామం, ఈవీవీ కాలనీ, పయెనీర్ ఎస్టేట్, వెంకటేశ్వర కాలనీలలో కోత ఉంటుందన్నారు. నార్సింగి%-%1 సబ్స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీ ఫీడర్లో మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు బృందావన్ కాలనీ, కృష్ణాగోషాల ఫీడర్లో 7హిల్స్, అల్లు స్టూ%వి% యో, వెస్టన్ మాల్దావ్స్, కృష్ణా గోషాల, ఎన్సీసీ ఫీడర్లో 2.30 నుంచి 5 గంటల వరకు ఎన్సీసీ కాలనీ, కోకాపేట్ సబ్స్టేషన్ అక్షయపాత్ర ఫీడర్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు సెరినీటి అపార్ట్మెంట్, ఉదయనగర్ కాలనీ, రెడ్డి బస్తీ, కోకాపేట్ ప్రభుత్వ స్కూల్, డిపిఆర్ అపార్ట్మెంట్, ఎర్త్హుడ్ అపార్ట్మెంట్, రాజపుష్ప, వెస్ట్ ఎవెన్యూ విల్లాస్, ఓపెన్ స్కై విల్లాస్, వెట్రీక్స్, కోకాపేట్ ఫీడర్లో ఉదయం 10 నుంచి 1 గంటల వరకు కోకాపేట్ గ్రామం, వెన్జా అపార్ట్మెంట్, జెశ్వితా లగ్జరీ అపార్ట్మెంట్, కోకాపేట్ 60 గజాలు, కోకాపేట్ 80 గజాలు, రాజీవ్ గృహకల్ప, గ్రీన్ బ్లోసమ్స్ అపార్ట్మెంట్, ఎడెన్ గార్డెన్స్, పొలూబీ అవుస్టాస్, అల్లూరి నార్త్ స్టార్ విల్లాస్ తదితర ప్రాంతాల్లో మరమ్మత్తుల కారణంగా కోతలు విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం-సీజీఎం పాండ్యానాయక్





గండిపేట్(క్రైం మిర్రర్): ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యానాయక్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని ప్రస్తుత విద్యుత్ సామర్థ్యానాకి సెక్షన్లో అదనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ఫీడర్లను రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్సీ శ్రీరామ్మోహన్, డిఈపి రత్నాకర్రావు, ఏడిఈ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, కమీషనర్ శ్రీదేవిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**గండిపేట్(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, కమీషనర్ శ్రీదేవిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో ఆమెను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ మణికొండ పురపాలక సంఘ పరిధిలో దాదాపు 350 మంది సఫాయి కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి 1.5.2023 తర్వాత జీతభత్యాలు పెరగని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని వీరి జీతాలు 24 వేల వరకు పెంచవలసిందిగా కోరుతున్నామన్నారు. సంవత్సరానికి 15 సాధారణ సెలవులు ఉన్నప్పటికిని వారికి ఆ సదుపాయం ఇవ్వడం లేదన్నారు. అవుట్సోర్సింగ్ లో ఉన్న వారందరినీ పర్మనెంట్ చేయవలన్నారు. పిట్టల ఆనంద్ అనే సఫాయి కార్మికుడు చనిపోతే అతనికి కనీస అవసరాలు తీర్చక, అతని భార్యకు ఉద్యోగం ఇచ్చినప్పటికీ జీతభత్యాలు ఇవ్వకపోవడం చాలా శోచనీయన్నారు. మణికొండలో ఉన్న ఇండ్లకు ఆస్తి పన్నును పెంచే ముందు ఏ రకమైన నోటీసు ఇవ్వకుండా, ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా పూర్తి సంవత్సరమునకు కట్టిన ఆస్తి పన్నును సగంకు ఆమోదించి మిగితా సగం ప్రక్కన పెట్టీ ఆస్తి పన్ను పెంచి ఆపై వడ్డీతో సహా కట్టమని ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబో సదరు అధికారులు జవాబు చెప్పవలన్నారు. పాత ఇండ్లకు ఆస్తి పన్ను కట్టుతున్నప్పటికి వారినీ ప్రస్తుత ఆస్తి మార్కెట్ ధర అనుసారం పెంచడం చట్ట ప్రకారము సరైన పద్ధతి కాదన్నారు. ఈ మధ్య పురపాలక సంఘానికి ?230 కోట్లు స్టాంపు డ్యూటీ ద్వారా వచ్చిన బడ్జెట్ దృష్టిలో ఉంచుకొని రోడ్ల మరమ్మత్తులు రోడ్లు వెడల్పు,



కొత్త రోడ్లను వేస్తూ, హై టెన్షన్ లైన్ల కింద అల్కాపూర్ టౌన్షిప్ - నార్సింగ్ సెక్షన్ వెంకటేశ్వర కాలనీలలో చేపట్టాలని కోరన్నారు. రోడ్లు వెడల్పు చేసే సమయంలో వీధి వ్యాపారులను దృష్టిలో ఉంచుకొని వారికి పురపాలక సంఘమే షాపులు నిర్మించి భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ వారు నిర్వహిస్తున్న తీరుగా ఇక్కడ కూడా వారికి షాపులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, పట్లోళ్ల రూపా రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, ఉపేందర్నాథ్ రెడ్డి, గోరుకంటి విఠల్, సంఘం శ్రీకాంత్, బొడ్డు శ్రీధర్, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, భాను చందర్, సయ్యద్ రఫీక్, అశ్వక్ అలీ, రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ సమీక్షా సమావేశం

**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలను అ్యధికారులు, సిబ్బంది పాటిస్తు సక్రమంగా విధులు నిర్వహించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ సూచించారు. బుధవారం ఆస్తిపన్ను వసూలు మెరుగుద, ఆన్లైన్ మీ సేవా ధరఖాస్తుల పరిష్కారం, నోటీసులు ఇవ్వడం తదితర వాటిపై అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు సలహాలు సూచనలు అందజేసి విధులను చేపట్టాలన్నారు. ఆస్తిపన్ను వసూలులో వేగం పెంచాలన్నారు. సర్కిల్కు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయడానికి అందరు సమిష్టిగా కృషి చేయాలన్నారు.




క్రైమ్ THE మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 గురువారం 13-2-2025

# ప్యారానగర్ డంప్ యార్డు పాపం బిఆరెస్ పార్టీదే

**అన్ని అనుమతులు ఇచ్చింది ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**ఉనికిని కాపాడుకోవడానికి ప్రజలను రెచ్చ గొట్టే ప్రయత్నం చేస్తున్నారని హెద్దేవా**

**మంత్రి దామోదర్ రాజనర్సింహకి, ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ కి సమాచారం**

**సీఎం దృష్టికి తీసుకెళ్లి దంపు యార్డ్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ**

**విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు గౌడ్**

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఫిబ్రవరి 12 :** ప్యారా నగర్ డంపింగ్ యాడ్ ఏర్పాటు కావడానికి కారకులు స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి అని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ మధ్యకాలంలో కొంతమంది నాయకులు వారి ఉనికిని కాపాడుకోవడానికి ప్రజలను రెచ్చ గొట్టే ప్రయత్నం చేస్తున్నారని హెద్దేవా చేశారు. స్థానిక శాసన సభ్యురాలు గతాన్ని మర్చిపోయారా లేదా ఈ ప్రాంత ప్రజలు గతాన్ని తెలుసుకోలేరనుకున్నారేమో నని చమత్కరించారు. ప్యారా నగర్ డంపింగ్ యాడ్ ఏర్పాటు కావడానికి కారకులు స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి అని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో అనుమతులు ఇచ్చినప్పుడు తమరు స్థానిక ఎమ్మెల్యేగా మాజీ మంత్రిగా పదవిలో కొనసాగుతూ అప్పుడు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డంప్ యార్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చి నేడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ డంపు యార్డు ఏర్పాటుకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 31-10-2015 సంవత్సరంలో 152 ఎకరాల భూమిని జిల్లా కలెక్టర్ జిన్నారం తాసిల్దారు పంచనామా చేసి జిహెచ్ఎంసి కి భూమిని కేటాయించారని గుర్తు చేశారు.డంపింగ్ యార్డ్ లోపలికి రోడ్ వేయడానికి




సుమారు 01 ఎకరా 23 గుంటలో అడవి భూమిలో రోడ్డు వేయడానికి సెంట్రల్ గవర్నమెంట్ నుంచి అనుమతులు తీసుకోవడానికి జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసి అనుమతులు తీసుకున్నారని గుర్తు చేశారు. 01 ఆగస్టు 2023 %+ూ చీశీ%.73 గత బిఆర్ఎస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని చెప్పారు.ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. అధికారంలో ఉన్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని గుర్తు చేశారు. ఇప్పటికే డంపింగ్ యార్డ్ విషయాన్ని జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహకి, ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ కి సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి దంపు యార్డ్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు.



## చందాల కోసం వచ్చాము అంటూ పట్టపగలే వృద్ధురాలి మేడలో నుండి గుర్తు తెలియని ఇద్దరు మహిళలు బంగారాన్ని ఎత్తుకెళ్లారు...!

**జగిత్యాల బ్యూరో ముస్తాఫా (క్రైమ్ మిర్రర్):** కథలాపూర్ మండలం ఊట్పల్లి గ్రామానికి చెందిన గజేల్లి లక్ష్మి(70) అనే వృద్ధురాలి మేడలో నుండి గుర్తు తెలియని ఇద్దరు మహిళలు బంగారాన్ని ఎత్తుకెళ్లారు. చందాల కోసం వచ్చాము అంటూ చెప్పి వృద్ధురాలిని మాటల్లో పెట్టి బెదిరించి మూతికి ప్లాస్టర్ వేసి మేడలో నుండి సుమారు ఏడు తులాల విలువ చేసే బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు సమాచారం. గ్రామంలోకి వచ్చి పట్టపగలే వృద్ధురాలి మెడలో నుండి బంగారు నగలు ఎత్తుకెళ్లడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై స్పందించి పోలీసులు నిందితులకు సంబంధించిన సీసీ ఫుటేజీ నుండి ఫొటోలను విడుదల చేశారు. వారిని గుర్తుపట్టినా లేదా చందాల కోసం ఎవరైనా వచ్చినా అనుమానాస్పదంగా కనపడిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## బృందావనం కాలనీ లో రోడ్డు నీటి డ్రైనేజీ సౌకర్యం కల్పించండి





**చౌటుప్పల్ ఫిబ్రవరి 12, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని బృందావనం కాలనీ వలిగొండ రోడ్డు లో నీటి నల్ల కలెక్షన్లు, డ్రైనేజీ, రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మార్వో కు, మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. గతంలో వాడుక భాషలో కేసీఆర్ కాలనీగా పిలవబడేది అని ఇప్పుడు బృందావనం కాలనీ గా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని అన్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్ 67 ఆఫ్ 2025 ఈ కాలనీ స్థలాల పంపిణీ గత 25 సంవత్సరాల క్రితం జరిగిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా కొన్ని కుటుంబాలు ఇండ్లను నిర్మించుకొని నివాసం ఉంటున్నారని అన్నారు. కానీ వారి కనీస అవసరాలకు నీరు, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేక అనేక విధాలుగా కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. కాబట్టి బృందావనం కాలనీవాసుల మీద దయ తలచి వాటిని కల్పించాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో పి యాదయ్య, ఎన్ నరేష్, రజని, మారయ్య, నవీన్, లక్ష్మి, నారాయణ, ఎం రాజు, ఎం యశ్వంత్, జి శ్రీను, ఏ నాగేష్, యాదయ్య, జయమ్మ, సందీప్, లింగస్వామి, వెంకటేష్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిగిలో 3.25 కిలోల గంజాయి పట్టివేత..!

**కర్ణాటక టు హైదరాబాద్ గంజాయి సరఫరా..!**

**వివరాలు తెలిపిన అసిస్టెంట్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ జీవన్ కుమార్...!**

**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** కర్ణాటక బోర్డర్ నుంచి హైదరాబాద్ కు బైక్ పై గంజాయి తరలిస్తుండగా ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు పట్టుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి శివారులో చోటుచేసుకుంది. అసిస్టెంట్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలాకర్ రెడ్డి ఆదేశాల మేరకు కర్ణాటక బార్డర్ లోని నాడేపల్లి తండాలో చౌహన్ శ్రీనివాస్ తన పొలంలో గంజాయిని పండించి ఇంట్లో నిల్వ ఉంచాడు.ఇలా నిలువ ఉంచిన గంజాయిని హైదరాబాద్ నుంచి వచ్చిన కస్టమర్లకు విక్రయించడం,స్వయంగానే హైదరాబాద్ తీసుకెళ్లి సరఫరా చేయడం చేస్తుంటాడని సమాచారం తెలుసుకున్నారు.చౌహన్ శ్రీనివాస్ తన స్నేహితుడు ముదెం అనిల్ నాడేపల్లి తండా నుంచి బుధవారం హీరో హోండా బైక్ పై గంజాయిని తీసుకొని హైదరాబాద్ కు బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు చౌహన్ శ్రీనివాస్ ను పరిగి శివారులో అదుపులోకి తీసుకున్నారు.చౌహన్ శ్రీనివాస్, ముదెం అనిల్ పట్టు కొని అదుపులోకి తీసుకొని, వారి వద్ద సుమారు 3. 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మత్తుకు బానిస అయిన వారికి ఈ గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తమ వెంట ఇన్స్పెక్టర్ సుభాష్, ఎస్సైలు అఖిల్ వెంకటేష్ సిబ్బంది ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి జీవన్ కిరణ్ తెలిపారు.





## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో బుధవారం స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## గాంధీ ఆస్పత్రికి రోడ్డు ప్రమాద మృతుల బాడీలు

హైదరాబాద్:ప్రయాగ్రాజ్లోని కుంభమేళా నుంచి తిరిగొస్తుండగా మధ్యప్రదేశ్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్కు చెందిన ఏడుగురు యాత్రికులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలను రెండు అంబులెన్సుల్లో జబల్పూర్ నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పోలీసులు, డీఎంహెచ్వో, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మల్లారెడ్డి, సంతోష్, శశికాంత్, రవి, రాజు మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి నాచారం నుంచి వచ్చిన వారి కుటుంబసభ్యులకు అప్పగించగా.. బ్యాంక్ మేనేజర్ టీవీ ప్రసాద్ మృతదేహాన్ని తార్నాకలోని గోకుల్నగర్లో ఉండే ఆయన కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## రాయల్ యూత్ సహకారంతో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

**చౌటుప్పల్ ఫిబ్రవరి 12, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ దగ్గర్లో నివాసముంటున్న కడు పేద కుటుంబానికి చెందిన ఎండి బాబా తండ్రి, గాలిబ్ కు వైద్య ఖర్చుల నిమిత్తం బంగారుగడ్డ కు చెందిన రాయల్ యూత్ నుండి అనారోగ్యంతో బాధపడుతున్న ఎండి బాబాకు చికిత్స నిమిత్తం 30 వేల రూపాయలు రాయల్ యూత్ కమిటీ సభ్యులు 20వ వార్డు కౌన్సిలర్ చేతుల మీదుగా నగదు సహాయం చేయడం జరిగినదని యూత్ అద్యక్షులు ఎండి యూనుస్ తెలిపారు.ఈ కార్యక్రమం రాయల్ యూత్ అధ్యక్షుడు యూనుస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బాబా షరీఫ్ మాట్లాడుతూ పేద మైనార్టీ వర్గాలకు సంబంధించిన బాబా సైకిల్ పంచర్ షాప్ నడుపుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్న సందర్భంలో అనారోగ్యం బారినపడి చికిత్స చేయించుకోవడంలో ఇబ్బంది పడుతున్న బాబాను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన రాయల్ యూత్ అధ్యక్షులు, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చోటే బాయ్, షాది ఖానా చైర్మన్ షేక్ కరీం, ఎండి అబ్దుల్లా, ఎజాజ్ పాషా, ఇమ్రాన్, ఫరుద్దీన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోతున్నాయి

### మంత్రి అచ్చన్నాయుడు వెల్లడి



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. చనిపోయిన కోళ్లను.. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపగా.. అవి బర్డ్ ఫ్లూ వల్లే చనిపోయినట్లు నివేదికలో స్పష్టమైందని చెప్పారు. ఈ వ్యాధి వల్ల ఏలూరు జిల్లా బాదంపూడిలో 2 లక్షల కోళ్లు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో 7 వేల కోళ్లు చనిపోయినట్టు సమాచారం ఉందన్నారు. బుధవారం అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. పౌల్ట్రీలలో ఉన్న గుడ్లను కూడా పూడ్చి వేయించామని చెప్పారు. ఈ బర్డ్ ఫ్లూ కారణంగా దాదాపు 5 లక్షల కోళ్లు చనిపోయినట్లు సమాచారం ఉందని.. కానీ 40 లక్షల కోళ్లు చనిపోయినట్లు ప్రచారం అయితే జరుగుతోందన్నారు. స్వల్ప ఉష్ణోగ్రతలో ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలిపారు. ఈ బర్డ్ ఫ్లూ ప్రబలిన ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల పరిధిలోని షాపులను మూసి వేశామన్నారు. ఇక బర్డ్ ఫ్లూ వల్ల ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతలు ఎంత వేగంగా పెరిగితే అంతే వేగంగా ఈ వ్యాధి తగ్గుతుందన్నారు. పౌల్ట్రీలలో శానిటేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల ఈ వ్యాధి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 10 కోట్లకు పైగా కోళ్లు ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మరోవైపు తెలంగాణలో సైతం లక్షలాది కోళ్లు ఈ వ్యాధి వల్ల మరణిస్తున్నాయి. ఇక మార్కెట్‌లో చికెన్ ధరలు సైతం అమాంతంగా పడిపోయాయి. కేజీ చికెన్ ధర రూ. 150గా ఉంది. అయినా చికెన్ కొనుగోలు చేసేందుకు వినియోగ దారులు భయాందోళనలకు గురవుతోన్నారు.

# అసత్యాల ప్రచారంలో ఆరితేరిన వైకాపా

### కావాలనే పథకాలపై దుష్ప్రచారం

### వైసిపి నేతల తీరుపై మండిపడ్డ మంత్రి



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** కూటమి ప్రభుత్వంపై కుట్రతో కొందరు అన్ని కార్యక్రమాల పై దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కావాలనే ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణం పై లబ్దిదారులకు అన్యాయం చేసినట్టు ప్రతిపక్ష పార్టీకి చెందిన పత్రికలో అన్ని వక్రీకరణలు చేస్తున్నారని అన్నారు. రిజాయిండర్ ఇచ్చినా.. దాన్ని కూడా వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఘోరంగా హత్యకు గురైన వ్యక్తిని గుండె పోటుతో చనిపోయారని నమ్మించే ఓ పార్టీ పత్రిక నుంచి ఇంత కంటే ఎక్కువ ఊహించలేమని అన్నారు. వైసీపీ నిర్వాకం కారణంగా ప్రధాన మంత్రి అవాస్ యోజన 1.0 కింద లబ్దిదారుల విషయంలో లేనిపోని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఎంపిక చేసిన 3.18 లక్షల మంది లబ్దిదారుల జాబితాను మార్చేసి వైసీపీ లబ్దిదారుల సంఖ్యను సగానికి తగ్గించేసిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. అప్పుడు మిగిలిపోయిన వారికే కేంద్ర ప్రభుత్వం 2024 ఏప్రిల్ తర్వాత ఇళ్లు మంజూరు అయ్యాయని అన్నారు. పేదవాళ్ళ ఇళ్ల నిర్మాణంకి సంబధించిన రూ.3,598 నిధులు కూడా గత ప్రభుత్వం మళ్లించింది.. పీఎంఎవై 1.0ను కేంద్రం 2027 వరకూ పొడిగించిందని మంత్రి తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ప్రస్తుతం లబ్దిదారుల సర్వే జరుగుతోంది.. ఇప్పటి వరకూ 11,600 మంది లబ్దిదారులను గుర్తించామని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్రం 50 వేల ఇళ్లను మంజూరు చేసింది.. ఇంకో 4.5 లక్షల ఇళ్లను కేటాయించేలా ప్రభుత్వ కృషి చేస్తోందని వెల్లడించారు.

## తిరుమల లడ్డూ కల్తీపై అబద్దాల ప్రచారం

- సిట్ అరెస్ట్‌లను కూడా తప్పదోవ పట్టిస్తున్న బాబు
- మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శలు

**తాడేపల్లిగూడెం, (క్రైమ్ మిర్రర్):** టీటీడీ టెండర్లలో ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ నలుగురిని సిట్ అరెస్ట్ చేసిన ఘటనను శ్రీవారి లడ్డూకి వాడే నెయ్యిలో కల్తీ ఆరోపణలకు ముడిపెట్టడం ఒక్క చంద్రబాబుకు మాత్రమే సాధ్యమని మాజీ మంత్రి,వైఎస్సార్‌సీపీ నేత కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు.తాడేపల్లిగూడెం లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూలో కల్తీనెయ్యి వినియోగించారంటూ ఎటువంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడంపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా చంద్రబాబులో మాత్రం మార్పు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన ఈ అంశంలో నిర్దిష్టమైన ఆధారాలు లేకుండానే ఇష్టారాజ్యంగా చంద్రబాబు, ఆయనకు నిత్యం భజన చేసే ఎల్లో మీడియా తప్పడు ప్రచారాలతో రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ బయటపెడుతుందనే భయంతో చంద్రబాబు గత ఏడాది సెప్టెంబర్ నెలలో ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి భక్తులు తల్లడిల్లేలా తప్పుడు ఆరోపణలు చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో పందికొవ్వు, గొడ్డు కొవ్వు కలిసాయంటూ ఒక పథకం ప్రకారం ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు సెప్టెంబర్ 18వ తేదీన ప్రకటించారు. తరువాత సెప్టెంబర్ 25న కేసు నమోదు చేశారు. 26వ తేదీన రాష్ట్రప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. తరువాత దీనిపై సుప్రీంకోర్ట్ లో వ్యాజ్యం దాఖలైన నేపథ్యంలో సీబీఐ నేతృత్వంలో సిట్ ను ఏర్పాటయ్యింది. నెయ్యిలో కల్తీ జరిగిందనే అంశాన్ని సిట్ నిర్ధారించక ముందే ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఆయనకు నిత్యం భజన చేసే ఎల్లో మీడియా నిర్ధారించి తీర్పులు కూడా చెప్పేయడం దుర్మార్గం అని మాజీమంత్రి అన్నారు.

## ఆందోళనకారులపై రాక్షసత్వం

- 1400 మంది హత్యకు గురైనట్లు గుర్తింపు
- బంగ్లాలో షేక్ హసీనా జమానాపై ఐరాసా నివేదిక

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** బంగ్లాదేశ్ అల్లర్లను అణివేసేందుకు ఆనాటి ప్రధాని షేక్ హసీనా క్రూరంగా వ్యవహరించిందని, ఆందోళనకారులను హత్యలు చేయించదని, అప్పటి ప్రభుత్వంపై ఐక్యరాజ్యసమితి సంచలన వ్యాఖ్యలు చేసింది. అధికారం చేజారకూడదనే ఉద్దేశంతో నిరసనకారులను హత్య చేసిననట్లు, దాడులు జరిపినట్లు పేర్కొంది. అవి మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాలని అభివర్ణించింది. ఐరాస స్పందనను అంతర్జాతీయ మీడియా కథనాలు ప్రచురించాయి. 2024లో జులై, ఆగస్టు నెలల్లో జరిగిన ఘటనలకు సంబంధించిన విచారణ ఆధారంగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నాయి. ఆ సమయంలో సుమారు 1400 మంది ఆందోళనకారులు చనిపోయినట్లు వెల్లడించాయి. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆందోళనలు తీవ్రంగా ఉండటంతో ఆమె దేశం విడిచి, భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఆమె రాజీనామాతో బంగ్లాలో అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతోంది. ప్రస్తుతం హసీనాపై పలు కేసులు నమోదయ్యాయి. బంగ్లాదేశ్‌కు చెందిన అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ గతంలో అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెతోపాటు పలువురు మాజీ క్యాబినెట్ మంత్రులు, సలహాదారులు, మిలటరీ అధికారులపైనా అరెస్టు వారెంట్‌లు జారీ అయ్యాయి.



## ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

### మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయానికి ప్రారంభం

**న్యూఢిల్లీ,, (క్రైమ్ మిర్రర్):** ఫ్రాన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అధికారిక పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారంనాడు పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. దక్షిణ మార్సెయిల్‌లోని మజార్గ్యూస్ యుద్ధ శ్మశానవాటికను సందర్శించి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధాని వెంట ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా హాజరయ్యారు. మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని కూడా మోదీ, మాక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. కాంటినెంటల్ ఫ్రాన్స్‌లో తొలి భారత రాయబార కార్యాలయం ప్రారంభించడం ద్వారా ఇరుదేశాల మధ్య మరింత లోతైన సంబంధాలు ఏర్పడటంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, మల్టీ డైమన్షయల్ రిలేషన్‌షిప్‌కు బలం చేకూరిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. దీనికి ముందు పారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో మాక్రాన్‌తో కలిసి సదస్సుకు మోద అధ్యక్షత వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. రెండో దఫా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆదేశంలో మోదీ పర్యటించనుండటం ఇదే ప్రథమం.

## ప్రతి గామపంచాయతీ రూ. 300 దినసరి వేతన లక్ష్యం

**ఉపాధి హామీ పథకం ప్రతి అంశంలోనూ పురోగతి కనిపించాలి**

**సిబ్బంది పనితీరులో బాధ్యతా రాహిత్యం కనిపిస్తే చర్యలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** :జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు దినసరి సగటు వేతనం రూ. 300 హక్కుగా పొందేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సరైన ప్రణాళికతో పనులు చేపట్టేలా వ్యవహరించాలని, ప్రతి గ్రామ పంచాయతీలోనూ పురోగతి కనిపించాలని, సిబ్బంది పనితీరులో బాధ్యతా రాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలం వారీగా, గ్రామపంచాయతీ వారీగా చేపడుతున్న పనులు, హాజరవుతున్న కూలీలు, సగటు వేతనం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ ఏడాది జనవరితో పోల్చితే ఫిబ్రవరి నాటికి కొన్ని మండలాలు, గ్రామపంచాయతీల్లో సగటు వేతనంలో పెరుగుదల కనిపించిందని, పథకం అమల్లో మిగిలిన మండలాలు, గ్రామపంచాయతీలు కూడా లక్ష్యాలు చేరుకోవాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు క్రియాశీలంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఋాష్ట్ర పారిశ్రామిక శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) సర్వేలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. పోటీతత్వ, ఆరోగ్యకర పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం, పారిశ్రామిక యూనిట్ల అవసరాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లలో సాంకేతిక వినియోగం, నిర్వహణ నైపుణ్యాల్లో లోపాలను గుర్తించి, సరిదిద్దేందుకు కూడా సర్వే ఫలితాలు దోహదం చేస్తాయన్నారు. ఇప్పటివరకు 28,816 యూనిట్ల సర్వే పూర్తయిందని, మిగిలినవాటి సర్వేను కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సర్వేను వేగవంతం చేసేందుకు ఎప్పటికప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి మార్గనిర్దేశనర చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదేవిధంగా పీఎం విశ్వకర్మ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. నరేగా-పల్లెపండగ కింద పశువుల షెడ్లకు సంబంధించి 746 పనులు మంజూరు కాగా 451 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు.

## స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

### ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రకులాలలో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు సీలింగ్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేసిందని, ఇప్పుడు ఏ సీలింగ్ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలని, లేదంటే యుద్ధం తప్పదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను పెంచకుండా పార్టీ పరంగా టికెట్లు ఇస్తామని సీఎం రేవంత్ ప్రకటించడం బీసీలను మోసం చేయడమేనని ఆర్. కృష్ణయ్య విమర్శించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ప్రకటించారని, ఇప్పుడు తప్పించుకోవడానికి కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రిజర్వేషన్లు పెంచకుండా కులాల వారీగా జనాభా లెక్కలు తప్పుగా చూపిస్తూ ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని సీఎంపై కృష్ణయ్య ఆరోపణలు చేశారు.

## పోలింగ్ డేటా అత్యంత భద్రం

### ఎక్కడా పొరపాట్లు లేవు: రాజీవ్ కుమార్

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** లోక్‌సభతో పాటు ఆయా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ డేటా తారుమారు అయ్యిందంటూ కొంతకాలంగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందించారు. ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించారు. 'పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో సహా లక్షలాది మంది సిబ్బంది పోలింగ్ డేటాలో పాలు పంచుకుంటారు. కాబట్టి, పొరబాటు జరగడానికి ఆస్కారం ఉండదు. ఈసీ నిష్పక్షపాతంగా ఉండే వ్యవస్థ. అత్యంత నమ్మకమైనది. ఎవరైనా తప్పు చేస్తే మా వ్యవస్థ సహించదు. పోలింగ్ డేటా వ్యవస్థ పకడ్బందీగా ఉంది. ఎటువంటి తప్పిదాలకు తావులేదు' అని 'లోక్‌సభ 2024 అట్లాస్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పేర్కొన్నారు. సార్వత్రిక సమరానికి సంబంధించి ఎన్నికల సంఘం విడుదల చేసిన పోలింగ్ డేటా లో తేడాలు ఉన్నాయంటూ ఇటీవల ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

## క్యూ లైన్లలో సకాలంలో రావాలి : టిటిడి

**తిరుమల, (క్రైమ్ మిర్రర్):** శ్రీవారి దర్శనం విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. టోకెన్లు, టికెట్లు పొందిన భక్తులు నిర్దేశిరచిన సమయానికి క్యూలైన్లలోకి ప్రవేశించాలని విజ్ఞప్తి చేసింది. ఇదే విషయాన్ని పలుమార్లు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా భక్తులకు తెలియజేసినట్లు అధికారులు తెలిపారు. 'ఇటీవల కొందరు భక్తులు వారికి కేటాయించిన సమయం కంటే ముందే వచ్చి క్యూలైన్లలోకి అనుమతించాలని తితిదే సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాలోనూ అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు'అని ప్రకటనలో పేర్కొన్నారు.

## కుంభమేళా మృతుల సంఖ్యపై తప్పుడు లెక్కలు

### బెంగాల్ సిఎం మమతా బెనర్జీ విమర్శలు

**కోల్‌కతా, (క్రైమ్ మిర్రర్):** యూపీలోని ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటన మృతుల సంఖ్యపై టీఎంసీ అధినేత్రి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం కచ్చితమైన మృతుల లెక్కలు చెప్పలేదని అన్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో బుధవారంనాడు బడ్జెట్ సమర్పణ అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ, పెద్ద సంఖ్యలో భక్తులు కుంభమేళాకు వస్తున్నప్పటికీ సరైన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. మహాకుంభ్ తొక్కిసలాట ఘటనలో చాలా మంది చనిపోయారు. ఎంతమంది చనిపోయారనే కచ్చితమైన లెక్కలను ప్రభుత్వం విడుదల చేయలేదు. మహాకుంభ్‌కు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నట్టు హైప్ సృష్టించారు. కానీ వేదకల వద్ద సరైన ఏర్పాట్లు చేయలేదు' అని మమతా బెనర్జీ ఆరోపించారు. మౌని అమావాస్య సందర్భంగా జనవరి 29వ తేదీ తెల్లవారు జామున ఒంటిగంట, రెండు గంటల మధ్య త్రివేణి సంగమం వద్ద తొక్కిసలాట జరిగిన 30 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మంది వరకూ గాయపడ్డారు. మమతా బెనర్జీ కంటే ముందు సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సైతం తొక్కిసలాట మృతుల సంఖ్యను యూపీ బీజేపీ సర్కార్ దాచిపెట్టిందని, తప్పుడు లెక్కలు చెప్పిందని ఇటీవల ఆరోపించారు. కుంభమేళా ఏర్పాట్లలో అవకతవకలను కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందన్నారు. ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, మహాకుంభ్ ఏర్పాట్ల పర్యవేక్షణను ఆర్మీకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

## గ్రూప్-2 పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదల

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఈ నెల 23వ తేదీన జరగాల్సిన గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ హాల్ టికెట్లను బుధవారం విడుదల చేసింది. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీపీఎస్సీ తెలిపింది. 23న ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు పరీక్ష జరగనుంది. కాగా.. పరీక్షా కేంద్రాలకు కేవలం హాల్ టికెట్ మాత్రమే తీసుకురావాలని, వేరే వస్తువులను ఏమీ తీసుకురావొద్దని ఏపీపీఎస్సీ సూచించింది.

# ప్రగ్యా జైశ్వాల్ ఏ క్రికెటర్‌తో డేట్‌కు వెళ్లాలనుకుంటుందో తెలుసా..?

కంచె సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యాజైశ్వాల్ ఆ తర్వాత అఖండ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది. ఈ జబల్ పూర్ భామ తాను సింగిల్‌గా ఉన్నానని, తనకు ఇష్టమైన వ్యక్తితో మింగిల్ అయ్యేందుకు రెడీగా ఉన్నానని చెప్పి అందరికీ షాకిచ్చింది.ఓ ఇంటర్వ్యూలో మీరు ఒకవేళ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఏ క్రికెటర్‌ను సెలెక్ట్ చేసుకుంటారని ప్రశ్నించాడు యాంకర్. శుభ్‌మన్ గిల్ పేరు చెప్పడంతోనే.. పెద్దగా నవ్విన ప్రగ్యాజైశ్వాల్.. ఎందుకు కాదు..? విధి తలిస్తే ఏదైనా జరుగొచ్చు. నేను విధిని నమ్ముతానంటూ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. ప్రగ్యా జైశ్వాల్ ప్రస్తుతం బాలకృష్ణ టైటిల్ రోల్ పోషిస్తున్న డాకు మహారాజ్‌లో నటిస్తుండగా.. షూటింగ్ పూర్తయింది.ఇక అఖండ 2లో మరోసారి బాలకృష్ణకు జోడీగా కనిపింబోతుంది. రామోజీఫిలిం సిటీలో వేసిన సెట్‌లో సీక్వెల్ షూటింగ్ మొదలు కానుంది. ప్రగ్యా జైశ్వాల్ మరోవైపు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తోన్న టైసన్ నాయుడు చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.





# ఇదో భావోద్వేగ ప్రయాణం

మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ముఫాసా- ది లయన్ కింగ్'. బారీ జెంకిన్స్ దర్శకుడు. 2019లో వచ్చిన యానిమేటెడ్ ఫిల్మ్ 'ది లయన్ కింగ్'కి కొనసాగింపుగా వాల్ట్ డిస్నీ పిక్చర్స్ పతాకంపై ఈ సినిమా రూపొందింది. ఇందులో ప్రధాన పాత్ర అయిన 'ముఫాసా'కి అగ్ర హీరో మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఈ సినిమా పోస్టర్‌ని ఆదివారం హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నమ్రత మాట్లాడుతూ 'ఇది ఫ్యామిలీ ఎమోషనల్ రైడ్. మహేశ్ చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.' అని తెలిపారు. ఇంకా ఇందులోని కీలక పాత్రలైన టాకా, టిమోన్ పాత్రలకు వాయిస్ ఓవర్స్ ఇచ్చిన సత్యదేవ్, అలీ కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. ఇందులోని పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప

# యువ దర్శకునితో మెగా ప్రాజెక్ట్?

ఒక్క సినిమా డైరెక్ట్ చేసిన వశిష్టకు, తన సినిమాను డైరెక్ట్ చేసే ఛాన్స్ ఇచ్చేశారు చిరంజీవి. ఆ సినిమానే 'విశ్వంభర'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇదిలావుంటే.. 'విశ్వంభర' తర్వాత మరో కుర్ర డైరెక్టర్‌తో సినిమా చేయనున్నారట చిరంజీవి. తనెవరో కాదు, 'దసరా'తో నానికి భారీ విజయాన్ని ఇచ్చిన శ్రీకాంత్ ఓదెల. ప్రస్తుతం నానితోనే 'ప్యారడైజ్' అనే సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు శ్రీకాంత్. ఈ సినిమా తర్వాత మెగా మూవీకి ఆయన రెడీ అవుతారనేది లేటెస్ట్ న్యూస్. ఇటీవలే చిరంజీవికి ఆయన ఓ కథ వినిపించారని, ఆ కథ చిరంజీవికి కూడా బాగా నచ్చిందని, బౌండ్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేయమని శ్రీకాంత్‌ని చిరంజీవి ఆదేశించారనేది ఫిల్మ్‌వర్గాల్లో బలంగా వినిపిస్తున్న టాక్. చిరంజీవి 'విశ్వంభర', శ్రీకాంత్ ఓదెల 'ప్యారడైజ్'.. ఈ



రెండు సినిమాలు పూర్తయ్యాక, ఈ మెగా ప్రాజెక్ట్ ఉంటుందట. ఈ వార్త ఫిల్మ్ వర్గాల్లో పొక్కడంతో కుర్ర డైరెక్టర్లకు అవకాశాలిస్తూ భిన్నమైన ప్రయాణాన్ని చిరంజీవి సాగిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆ వార్తలో నిజమెంత?

ప్రస్తుతం రవితేజ 'మాస జాతర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మే9న విడుదల కానుంది. ఇదిలావుంటే.. రవితేజ లైనప్ విషయంలో ఓ క్రేజీ న్యూస్ ఒకటి వినిపిస్తున్నది. తమిళంలో ఓ స్టార్ హీరో నటిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమాలో ప్రత్యేక పాత్ర చేయడానికి రవితేజ అంగీకరించారట. వివరాల్లోకెళ్తే.. సూర్య కథానాయకుడిగా ఆర్.జె. బాలాజీ దర్శకత్వంలో ఓ భారీ పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలోనే రవితేజ స్పెషల్ రోల్ చేయనున్నారట. ఇటీవలే రవితేజకి దర్శకుడు బాలాజీ క్యారెక్టర్‌ని నరేట్ చేశారని, పాత్ర నచ్చడంతో నటించేందుకు రవితేజ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ విషయం ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత ఏడాది చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ స్పెషల్ రోల్ చేసిన విషయం తెలిసిందే.





# నేనేం ఐటమ్ గర్ల్‌ని కాదు

రజనీకాంత్ 'జైలర్'లో 'వా.. కావాలయ్యా.. దా.. దా..' అంటూ ఐటమ్ నంబర్లో చెలరేగిపోయింది తమన్నా. ఆ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా.. ఆ పాట, అందులో తమన్నా నాట్యాభినయం కొన్ని నెలలపాటు సోషల్ మీడియాను కుదిపేశాయనే చెప్పాలి. రీసెంట్‌గా 'స్త్రీ 2'లో కూడా ఓ చిన్న పాత్ర చేశారు తమన్నా. అందులో కూడా 'ఆజ్ కీ రాత్..' పాటలో సందడి చేశారు. ఆ సినిమా ఏకంగా 900కోట్ల క్లబ్‌లో చేరింది. దాంతో 'తమన్నా ఐటమ్ సాంగ్ చేస్తే సినిమా హిట్' అనే సెంటిమెంట్ మొదలైంది. మామూలుగానే సినిమావాళ్లకు సెంటిమెంట్లు ఎక్కువ. అందుకే.. దర్శక, నిర్మాతలంతా ఐటమ్ సాంగ్స్ చేయమంటూ తమన్నా ఇంటిముందు క్యూ కడుతున్నారట. దాంతో తమన్నా అసహనం వ్యక్తం చేశారు. రీసెంట్‌గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నేను చేసిన పాటలు ఆ సినిమాల సక్సెస్‌లకు హెల్ప్ అవ్వడం ఆనందంగానే ఉంది. అందుకని, వరుసగా ఐటమ్ నంబర్లే చేయమంటే ఎలా? 'జైలర్' రజనీసార్ సినిమా అవ్వడంతో ఇష్టంతో చేశా. 'స్త్రీ2' డైరెక్టర్ అమర్ కౌశిక్ నాకు మంచి ఫ్రెండ్. తను అడగ్గానే కాదనలేక చేశా. అంతేతప్ప అదేపనిగా ఈ తరహా పాటలు చేయడానికి నేనేం ఐటమ్ గర్ల్‌ని కాదు..' అంటూ అసహనం వ్యక్తం చేసింది తమన్నా భాటియా.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.